Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 276 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 25 అక్టోబర్ 2023 | బుధవారం | పేజీలు : 4

## అఖిలేష్ భావి ప్రధాని... సంచలన పోస్టర్లు

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ భావి ప్రధాని అంటూ లక్నో లో పోస్టర్లు వెలిసాయి. పార్టీ కార్యాలయం వెలుపల కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఈ పోస్టర్లు అందర్నీ ఆకర్షిస్తున్నాయి. అఖిలేష్ పై ఉన్న ప్రేమ, ఆదరణను కార్యకర్తలు ఈ రూపం లో చాటుకుంటున్నారని ఎస్పీ ప్రతినిధి ఫఖ్రుల్ హసన్ చాంద్ వివరణ ఇచ్చారు. "జూలై 1న అఖిలేష్ పుట్టినరోజు. అయితే ఆయన బర్త్‌డేను కార్యకర్తలు పలుసార్లు చేసుకుంటూ ఉంటారు. అఖిలేష్‌పై కార్యకర్తలకు ఉన్న ప్రేమ, అభిమానం అలాంటింది. ఇవాళ అఖిలేష్ పుట్టినరోజును కొందరు కార్యకర్తలు జరుపుకొంటున్నారు" అని హసన్ చాంద్ తెలిపారు. అఖిలేష్ ఈ దేశ ప్రధానిగా సేవలందించాలని కార్యకర్తలు ప్రార్ధనలు చేస్తున్నట్టు చెప్పారు.

# గ్రేటర్ కాంగ్రెస్‌లో ఉత్కంఠ!

## గ్రేటర్‌లో ఖరారు కాని 11 స్థానాలు

## గెలుపు గుర్రాల వేటలో కాంగ్రెస్ అధిష్ఠానం




హైదరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఇంకా ఖరారు చేయని స్థానాల్లో నిలిచే అభ్యర్థులెవరు అనేది ఆసక్తిగా మారింది. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన 13 స్థానాల కంటే మిగిలిన 11 స్థానాలే పార్టీకి కీలకం. పాత బస్తీలోని చార్మినార్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, కంటోన్మెంట్, అంబర్‌పేట, ఎల్‌బీ నగర్, మహేశ్వరం, రాజేంద్రనగర్, పటాన్‌చెరు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. ఈ స్థానాలపై పార్టీ నేతలు, కార్యకర్తలతోపాటు బీఆర్ఎస్ అభ్యర్థుల్లోనూ ఉత్కంఠ నెలకొన్నది. టికెట్ కోసం నియోజకవర్గాల వారీగా నలుగురైదుగురు పోటీలో ఉండడంతో అభ్యర్థులను ఖరారు చేయడంలో అధిష్ఠానం మల్లగుల్లాలు పడుతోంది. పలువురు ఆశావహులు ఢిల్లీ స్థాయిలో టికెట్ కోసం సంప్రదింపులు జరిపి తొలి జాబితా ఖరారు కాగానే నియోజకవర్గ బాట పట్టారు. పలు నియోజకవర్గాల్లో ఇతర పార్టీల నేతలు కొత్తగా కాంగ్రెసలో చేరుతుండడంతో సమీకరణలు వేగంగా మారుతన్నాయి. ఈ క్రమంలో ఆయా స్థానాల్లో కాంగ్రెస్ టికెట్ ఎవరినివరిస్తుందోనన్న అంశం ఆసక్తిగా మారింది.

**సర్వేల ఆధారంగా ముందుకు :** ఖరారు చేయని 11 స్థానాల అభ్యర్థుల ఎంపిక అధిష్ఠానానికి కత్తిమీద సాములా మారింది. ఇప్పటికే కాంగ్రెస్ ఏర్పాటు చేసుకున్న ఓ సంస్థ ద్వారా సంబంధిత అభ్యర్థులపై సర్వేలు కూడా చేయించిన్నట్లు సమాచారం. దీనికితోడు పలువురు కీలక నేతలు ఫలానా నియోజకవర్గానికి తదమ అభ్యర్థిత్వం ఖరారు చేయాలంటూ ఒత్తిడి తెస్తుండడంతో గెలుపు ఓటములపై భేరీజులు వేసుకుంటూ తీవ్రమైన కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే సర్వేల్లో వచ్చిన ఫలితాల ఆధారంగా అభ్యర్థులను ఖరారు చేస్తే ఎదురయ్యే సవాళ్లను సమీక్షించిన తర్వాతే ముందుకెళ్లే అవకాశాలున్నాయి. మొదటి జాబితాలోనే ఎల్‌బీనగర్, శేరిలింగంపల్లి స్థానాలకు అభ్యర్థులు ఖరారవుతారని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఎల్‌బీనగర్ టికెట్ సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ ఆశిస్తుండగా టీపీసీసీ నేతలతోపాటు ఢిల్లీ పెద్దలు సైతం సానుకూలంగానే ఉంటారని భావించారు. అందుకు భిన్నంగా మొదటి జాబితాలో ఆ టికెట్ ఖరారు కాలేదు. కాంగ్రెసలో చేరిన ఎం.రఘునాథ్ యాదవ్‌కు శేరిలింగంపల్లి టికెట్, గాలి అనిల్‌కుమార్‌కు పటాన్‌చెరు టికెట్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు రాజేంద్రనగర్ టికెట్ , బడంగ్‌పేట మేయర్ భర్త నర్సింహారెడ్డికి మహేశ్వరం టికెట్, గద్దర్ కుమార్తె వెన్నెలకు కంటోన్మెంట్ టికెట్ దక్కుతుందని అంతా భావించారు. కానీ వారికి సైతం అభ్యర్థిత్వం ఖరారు కాలేదు. దాంతో ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తల్లో టికెట్ కేటాయింపుల అంశం ఉత్కంఠ కలిగిస్తోంది.

**ఒకే స్థానానికి ఇద్దరిద్దరి పోటీ :** టికెట్ దక్కించుకోవడానికి పలువురు ఆశావహ నేతలు ఢిల్లీలోని అగ్రనేతలతో సంప్రదింపులు జరిపారు. నియోజకవర్గాల్లో పార్టీ చేపట్టిన కార్యక్రమాల, వివిధ అనుకూల సర్వే రిపోర్టులను వారికి అందజేసి టికెట్ వచ్చేలా పావులు కదిపారు. అదే సమయంలో తొలి జాబితా ప్రకటన రావడంతో వారంతా ఢిల్లీ నుంచి నియోజకవర్గాల బాట పట్టారు. ఖైరతాబాద్ టికెట్ కేటాయింపుపై రోహిన్ రెడ్డి విశ్వాసంతో ఉండగా, అదే టికెట్‌ను పీజేఆర్ కూతురు విజయారెడ్డి ఆశిస్తున్నారు. జూబ్లీహిల్స్ టికెట్ కోసం పీజేఆర్ తనయుడు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయితే పీజేఆర్ కూతురుకు టికెట్ దక్కుతుందా? కుమారుడికి దక్కుతుందా?? అనేదానిపై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు చర్చించుకుంటున్నా ఒక అవగాహనకు రాలేకపోతున్నారు.. ఇప్పటికే విజయారెడ్డి ఖైరతాబాద్ నుంచి రెండుసార్లు కార్పొరేటర్‌గా గెలువడంతోపాటు నియోజకవర్గంలో తన తండ్రిపైప్రజల్లో ఉన్న అభిమానం, తనకు ఉన్న పరిచయాలను ఓట్లుగా మలుచుకోగలుగుతాననే ధీమాతో ఉన్నారు. ఇక కంటోన్మెంట్, కూకట్‌పల్లి, అంబర్‌పేట, తదితర నియోజకవర్గాల్లో ఇద్దరు ముగ్గురు అభ్యర్థులు పోటీపడుతుండటంతో అభ్యర్థులను ఖరారు చేయడంలో ఎటూ తేల్చుకోలేకపోతోందంటున్నారు.

**బలమైన నేతల చేరికలతో..** గ్రేటర్‌లోని పలు నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నేతలు కాంగ్రెసలో చేరుతున్నారు. దీంతో స్థానికంగా రాజకీయ సమీకరణలు వేగంగా మారుతున్నాయి. శేరిలింగంపల్లి నుంచి తాజాగా టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న జగదీశ్వర్ గౌడ్ దంపతులు కాంగ్రెసలో చేరారు. వీరు మాదాపూర్, హఫీజ్‌పేట డివిజన్లకు కార్పొరేటర్లుగా ఉండడంతోపాటు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బలమైన నేతగా జగదీశ్వర్‌గౌడ్ ఉన్నారు. శేరిలింగంపల్లి బీఆర్ఎస్ టికెట్ ఆశించిన ఆయనను జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్‌గా బీఆర్ఎస్ ఖరారు చేసింది. అయినా అసంతృప్తి వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. టికెట్ కోసమే కాంగ్రెసలో చేరారా? ఇప్పటికే టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులకు బలం చేకూరుస్తున్నారా? అనేది తేలాల్సి ఉంది. కంటోన్మెంట్ నుంచి బీఆర్ఎస్ నేత శ్రీగణేష్ ఇటీవల కాంగ్రెసలో చేరారు. స్థానికంగా బలమైన నేతగా ఉన్న ఆయనకు టికెట్ దక్కుతుందా.? లేకుంటే కాంగ్రెస్ బరిలో నిలపాలని భావిస్తున్న గద్దర్ కూతురు వెన్నెలకు మద్దతు ఇస్తారా అనేదానిపై స్పష్టత లేదు. అయితే దివంగత సాయన్న సెంటిమెంట్‌తో కంటోన్మెంట్‌లో గెలుపు సాధించాలని సాయన్నకుమార్తె లాస్య నందితను బీఆర్ఎస్ బరిలో నిలపగా అదే సెంటిమెంట్‌తో గద్దర్ కుమార్తె వెన్నెలను కాంగ్రెస్ బరిలో నిలిపి బీఆర్ఎసకు చెక్ పెట్టాలని చూస్తోందా అనేది ఒకటిరెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందంటున్నారు స్థానిక లీడర్లు.

## కుర్చీల కోసం పార్టీలు మారే వ్యక్తి రేవంత్ రెడ్డి : హరీష్ రావు

సంగారెడ్డి జిల్లా: ఈ నెల 30న నారాయణఖేడ్ నియోజకవర్గంలో సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ జరగనుంది. సభ ఏర్పాట్లను మంత్రి హరీష్ రావు పరిశీలించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిలపై మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ భారీ బహిరంగ సభ నేపథ్యంలో కార్యకర్తల సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. "కుర్చీల కోసం పార్టీలు మారే వ్యక్తి రేవంత్ రెడ్డి. గతంలో రేవంత్ రెడ్డి టీడీపీలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. వాళ్ళ నాన్న చనిపోతే అంత్యక్రియలు చేశాక స్నానం చేయడానికి కరెంట్ లేదని అసెంబ్లీలో చెప్పారు. ఆనాడు సోనియా గాంధీని బలి దేవత అన్నారు. ఇటలీ బొమ్మ అన్నారు. నోటికి ఏదోస్తే అదే తిట్టింరు. ఇప్పుడు సోనియాగాంధీ దేవత అంటున్నారు. రేవంత్ నోటికి మొక్కాలి. ఏ ఎండకి ఆ గొడుగు పట్టే రకం రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ వచ్చి నేను బీజేపీతో పోరాడుతా బీజేపీపై పోరాడే డీఎన్ఏ నాది అన్నారు. మరి రేవంత్ రెడ్డి డీఎన్ఏ ఏదో రాహుల్ తెలుసుకోవాలి రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి డీఎన్ఏలు మ్యాచ్ కావట్లేదు అని మంత్రి హరీష్ రావు అన్నారు.

## కమలంలో కుంపట్లు.. అభ్యర్థుల రాజీనామాలు రీజనేంటి?!

హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఎన్ని సీట్లలో గెలుస్తుందో తెలియదు. అధికారంలోకి వచ్చేస్తామని నిన్న మొన్నటి వరకు గంభీర ప్రకటనలు చేసిన వారు కూడా ఇప్పుడు గౌరవ ప్రదమైన స్థానాలు దక్కితే అదే చాలు.. పది వేలు అనుకుంటున్నారు. అలాంటి పార్టీలో ఇప్పుడు తమకు టికెట్ దక్కలేదంటూ.. పలువురు నాయకులు.. అసంతృప్తి వ్యక్తం చేస్తూ.. పార్టీకి రాజీనామాలు చేస్తున్నారు. ఈ పరిణామం రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి శరాఘాతంగా మారింది. తాజాగా తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అధినాయకత్వం తొలి జాబితా ప్రకటించింది. అయితే.. దీనిలో తమకు చోటు ఖచ్చితంగా దక్కుతుందని భావించిన వారు చాలా మంది ఉన్నారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి పార్టీ కోసం పనిచేసిన మహిళా నాయకులు కూడా ఉన్నారు. అయితే, ఏం జరిగిందో ఏమో .. అసలు వీరిని పార్టీ పరిగణనలోకి కూడా తీసుకోలేదు. దీంతో వీరు లబోదిబో మంటూ.. పార్టీ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముథోల్ టికెట్ దక్కకపోవటంతో నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్ష పదవికి రమాదేవి రాజీనామా చేశారు. కన్న తల్లి లాంటి




పార్టీ తనకు అన్యాయం చేసిందని బోరున విలపించారు. త్వరలోనే తన రాజకీయ భవిష్యత్తుపై నిర్ణయం ప్రకటిస్తానని చెప్పారు. రమాదేవిని పార్టీలో చేర్చుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ ఎస్ నాయకులు తమ వారిని రంగంలోకి దింపాయి. స్థానికంగా రమాదేవి ప్రభావం ఎక్కువగానే ఉందని అంచనా వేస్తున్నారు. ఇక, పటాన్‌చెరు టికెట్‌ను నందీశ్వర్ గౌడ్‌కు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్న 8 మంది మండల, డివిజన్ బీజేపీ అధ్యక్షులు.. పటాన్‌చెరు అభ్యర్థిపై పునరాలోచన చేసుకోవాలని పార్టీ నాయకత్వానికి అల్టిమేటం జారీ చేశారు. దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకోకపోతే.. పార్టీ నుంచి వెళ్లిపోతామని వారు హెచ్చరించడం గమనార్హం. అదేవిధంగా బీజేపీ సీనియర్ నేత, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తన పేరు మెదట లిస్టులో లేకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్ రెడ్డిని కలసి తన ఆవేదనను వ్యక్తపరిచారు. పార్టీలో ఉండాలో వద్దో చెప్పాలని నిలదీసినట్టు ఆయన అనుచరులు పేర్కొంటున్నారు.

మరోవైపు బీజేపీ అభివృద్ధికి కృషి చేసిన మాజీ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి కూడా తనకు ప్రాధాన్యం దక్కలేదని చెబుతూ.. పార్టీకి రాజీనామా చేశారు. మొత్తానికి మొదటి జాబితాలోనే బీజేపీలో సెగలు పొగలు బయటపడడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



# ఇంత వేరియేషనా?

## సీఎం లిద్దరికీ గుడ్ న్యూస్ చెప్పిన

# లేటెస్ట్ సర్వే

హైదరాబాద్ / అమరావతి : ఐదురాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో తెలంగాణలో రాజకీయాలు వేడెక్కిన సంగతి తెలిసిందే. అధికార బీఆరెస్స్, కాంగ్రెస్ పార్టీలు ప్రచారాల్లో బిజీ అయిపోగా.. తొలివిడత లిస్ట్ విడుదల పై బీజేపీ కసరత్తులు చేస్తుంది. మరోపక్క చంద్రబాబు రజమండ్రి సెంట్రల్ జైల్లో ఉండగా... ఏపీలో అధికార వైసీపీ ఎన్నికల ప్రచార కార్యక్రమాలు చాపకింద నీరులా జరిగిపోతున్నాయని తెలుస్తుంది. ఈ నేపథ్యంలో తాజాగా ఒక సర్వే విడుదలయ్యింది. ఎన్నికలు దగ్గరపడుతున్నాయంటే.. పార్టీలు, నాయకులు సందడితో పాటు సర్వేల సందడి కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో చాలా సర్వేలు ప్రజానాడికి చాలా దగ్గరగా కూడా ఉంటుంటాయి! ఈ క్రమంలో తాజాగా సర్వే ఏజెన్సీ సి.ఎన్.ఎక్స్ తో కలిసి ఇండియా టివి నిర్వహించిన తాజా ఒపీనియన్ పోల్ తెలుగు రాష్ట్రాల్లో జరగబోయే ఎన్నికలపై పబ్లిక్ పల్స్ ఫలితాలు వెల్లడించింది! అవును... త్వరలో జరగబోయే తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది ప్రారంభంలో జరగబోయే ఏపీ ఎన్నికల ఫలితాలపై సర్వే ఫలితాలు వెల్లడించింది. ఇందులో భాగంగా... తెలంగాణలో కె చంద్రశేఖర్ రావు నేతృత్వంలోని భారత రాష్ట్ర సమితి (బీఆరెస్స్) మళ్లీ అధికారంలోకి వస్తుందని తెలిపింది. ఇదే సమయంలో ఏపీలో వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ లో తిరిగి అధికారంలోకి వస్తుందని అంచనా వేసింది. తాజా సర్వే ఫలితాలు రాబోయే ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు అధికారంలోనే ఉన్న పార్టీలే వచ్చే అవకాశం పుష్కలంగా ఉందని సర్వే ఫలితాలు చెబుతు న్నాయి. అయితే గతంలో వచ్చిన సీట్ల సంఖ్య కాస్త తగ్గే అవకాశం ఉందని మాత్రం స్పష్టం చేసింది. ఇందులో భాగంగా తెలంగాణలో బీఆరెస్స్ మెజారిటీ మార్కును దాటే అవకాశం ఉన్నందున కేసీఆర్ వరుసగా మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని సర్వేలో తేలింది. తాజా ఫలితాల ప్రకారం... తెలంగాణలో బీఆరెస్స్ 70 సీ ట్లు, కాంగ్రెస్ 34, బీజేపీ 7 సీట్లు గెలుచుకునే అవకాశం ఉండగా... అసదుద్దీన్ ఒవైసీకి చెందిన ఏఐఎంఐఎం 7 స్థానాలను నిలబెట్టుకో నుందని సర్వే ఫలితాలు వెల్లడించాయి. ఇక ఇందులో... ఉత్తర తెలంగాణలో బీఆరెస్స్ తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంటుంది. ఈ క్రమంలో... ఆ ప్రాంతంలోని 49 అసెంబ్లీ స్థానాల్లోనూ 27 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని సర్వే ఫలితాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంలో కాంగ్రెస్ కు 17 సీట్లు వస్తాయని, బీజేపీకి 4 సీట్లు రావచ్చని అంచనా! అదేవిధంగా... దిగువ తెలంగాణ ప్రాంతం విషయానికొస్తే... ఇక్కడ బీఆరెన్స్ మరింత ఎకువగా ఆధిక్యాన్ని ప్రదర్శించబోతోందని తెలుస్తుంది. ఇందులో భాగంగా... 42 అసెంబ్లీ స్థానాలు ఉండగా, బీఆరెస్స్ కనీసం 30 స్థానాలను గెలుచుకోవచ్చని అంచనా వేసింది. ఇక, కాంగ్రెస్ 12 స్థానాల్లో గెలుపొందగా, బీజేపీ, ఏఐఎంఐఎంలు ఖాతాలు ఓపెన్ చేసే అవకాశం లేదని ఈ ఫలితాలు చెబుతున్నాయి! ఇదే సమయంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ పనితీరుపై జరిగిన సర్వేలే... 45 శాతం మంది సీఎం గా కేసీఆర్ ఫెర్మార్మెన్స్ బాగుందని అభిప్రాయపడ్డారని, 15 శాతం మంది ఓటర్లు యావరేజ్ గా ఉందని చెప్పారని ఫలితాలు చెబుతున్నాయి! ఇక మిగిలిన 40 శాతం మంది ఓటర్లు ఆయన పనితీరు బాగాలేదని అభిప్రాయపడ్డారని తెలుస్తుంది. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే... ఆ ప్రాంతంలో అక్టోబర్ జరిగిన సర్వేలో వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీకి రాష్ట్రంలో 46 శాతం ఓట్లు రావచ్చని, టీడీపీకి 42 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది ఈ తాజా సర్వే. ఇదే క్రమంలో... వైసీపీకి 18 లోక్ సభ స్థానాలు వస్తాయని, టీడీపీకి 7 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని సర్వే అంచనా వేసింది. ఇదే క్రమంలో... ఏపీలో కాంగ్రెస్, బీజేపీలకు సున్నా ఫలితాలు వస్తాయని ఈ సర్వే చెబుతోంది!

గరుడ వార్త



# సంపాదకీయం

## గూగుల్ కు శాంసంగ్ గుడ్ బై చెప్పనుందా?

## అదే జరిగితే దిమ్మ తిరిగే షాక్

ప్లాట్ ఫాం ఏదైనా సెర్చింజన్ అన్నంతనే గూగుల్ అన్న మాట నోట రావటం కొన్నేళ్లుగా కామన్ కావటం తెలిసిందే. అయితే.. రోజులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. అదే విషయాన్ని తాజాగా గుర్తుకు చేస్తోంది మైక్రోసాఫ్ట్. ఇప్పటివరకు సెర్చింజన్లలో తిరుగులేని అధిక్యతను ప్రదర్శిస్తున్న గూగుల్ కు దిమ్మ తిరిగే షాకిచ్చేందుకు మైక్రోసాఫ్ట్ సిద్ధం కావటం తెలిసిందే. అన్ లైన్ లో సమాచారం అడిగినంతనే.. బోలెడంత సమాచారాన్ని అందించే గూగుల్ కు.. మైక్రోసాఫ్ట్ సంస్థకు చెందిన చాట్ జీపీటీ రూపంలో ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని చెబుతున్నారు. అదెలా అంటే.. ఏదైనా విషయాన్ని చాట్ జీపీటీని అడిగినంతనే.. సరైన సమాచారాన్ని క్లుప్తంగా ఇస్తోంది చాట్ జీపీటీ. అదే సమయంలో గూగుల్ విషయానికి వస్తే.. ఏదైనా సమాచారం గురించి అడిగితే.. కుప్పలు కుప్పలుగా సమాచారాన్ని పడేయటమే తప్పించి.. మరింకేమీ చేయదు. అదే.. మైక్రోసాఫ్ట్ కు చెందిన చాట్ జీపీటీ మాత్రం.. అడిగిన వివరాలకు సంబంధించిన సమాచారాన్ని కుప్లంగా స్పష్టంగా ఇవ్వటం ఇప్పటి తరానికి తెగ నచ్చేస్తుంది. దీంతో అందరు ఇప్పుడు చాట్ జీపీటీని వాడేందుకు ఆసక్తిని చూపుతున్నారు. దీంతో.. టెక్ కంపెనీలు తమ తీరును మార్చుకుంటున్నాయి. ఇంతకాలం గూగుల్ కు మించిన సెర్చింజన్ మరొకటి లేదనే వాదనకు తలొగ్గే పరిస్థితి. ఇప్పుడు చాట్ జీపీటీ వచ్చి దాని అధిక్యతను సవాలు విసిరింది. చాట్ జీపీటీ సత్తా తెలిసిన టెక్ కంపెనీలు ఆ దిశగా అడుగులు వేస్తున్నాయి. ఇందుకు ఉదాహరణగా మొబైల్ ప్రపంచంలో మంచి పేరున్న సంస్థల్లో ఒకటిగా ఉన్న శాంసంగ్ తన తాజా సీరిస్ లో డిఫాల్ట్ సెర్చింజన్ గా మైక్రోసాఫ్ట్ కు చెందిన బింగ్ యాప్ ను వాడేందుకు వీలుగా సమాచాలోచనలు చేస్తోంది. ఇంతకాలం శాంసంగ్ ఫోన్లలో సెర్చి ఆప్షన్లలో గూగుల్ ఉండేది. అందుకు భిన్నంగా ఇప్పుడు బింగ్ ను ఇవ్వటం.. దానికి అదనంగా చాట్ జీపీటీ అందుబాటులోకి రావటంతో.. దాని మీద యూజర్ల ఆసక్తి పెరిగింది. దీనికి తగ్గట్లే శాంసంగ్ సంస్థ తమ ఫోన్లలో గూగుల్ కు బదులుగా మైక్రోసాఫ్ట్ బింగ్ ను ఉంచేందుకు వీలుగా చర్చలు జరుగుతోంది. అదే జరిగితే.. గూగుల్ కు భారీ షాక్ తప్పదంటున్నారు. ఒక అంచనా ప్రకారం శాంసంగ్ తో మైక్రోసాఫ్ట్ డీల్ సెట్ అయితే..గూగుల్ కు దాదాపు రూ.300 కోట్లు నష్టపోవటం ఖాయమంటున్నారు. ఈ భారీ మొత్తాన్ని గూగుల్ కోల్పోవటం ఏ మాత్రం క్షేమకరం కాదన్న మాట వినిపిస్తోంది. మరి.. దీనికి శాంసంగ్ ఎలా రియాక్టు అవుతుందన్నది ఇప్పుడు అసలు ప్రశ్న.

# సర్కారులో.. ప్రసవ వేదన




మంచిర్యాల : సర్కారు సేవలకు వైద్యుల కొరత తలనొప్పిగా మారింది. ముఖ్యంగా ప్రసూతి విభాగానికి సరిపడా వైద్యురాళ్లు లేక పెద్దాసుపత్రి అవస్థలు పడుతోంది. ఓ వైపు ఆరోగ్యశాఖ మంత్రి సర్కారు దవాఖానాల్లో ప్రసవాలు పెంచాలని, సాధారణ కాన్పులకే మొగ్గు చూపాలని పదేపదే హెచ్చరిస్తున్నారు. దీంతో వైద్యులకు శస్త్రచికిత్సలు చేయాలంటే వణుకు పుడుతోంది. తప్పనిసరి సాధారణ ప్రసవం కోసం వేచిచూస్తే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇందుకు ఇటీవల పెద్దాసుపత్రిలో జరిగిన ఒకే(సాధారణ) ప్రసవంలో ముగ్గురు జన్మించి చనిపోవడం, రెండురోజుల కిందట కూడా శస్త్రచికిత్స చేయాలని సూచించినా సాధారణం కోసం వేచిచూసి తమ పాప మృతికి కారణమయ్యారంటూ బాధితులు ఆందోళన చేపట్టడం నిదర్శనం. దీంతో ప్రసూతి వైద్యురాళ్ల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యి మాదిరిగా మారి తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నట్లు తెలుస్తోంది. దీంతో పలువురు రాజీనామా చేయగా, మరో ఇద్దరు ఇతర కారణాలతో వెళ్లిపోయారు

**పని ఒత్తిడే కారణమా..?**

జిల్లా ఆసుపత్రిలో మొత్తం ప్రసూతి వైద్యులు తొమ్మిదిమంది ఉండగా.. ప్రస్తుతం ఐదుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో ఒకరు పూర్తిగా ఓపీ సేవలకే పరిమితం కావడంతో మిగతా నలుగురు ప్రసవాల (సాధారణ, శస్త్రచికిత్స) సేవలు అందిస్తున్నారు. పెద్దఎత్తున గర్భిణులు ఇక్కడికే వస్తుండటంతో పెద్దాసుపత్రి, ఇక్కడి వైద్యులపై తీవ్ర భారం పడుతోంది. తొమ్మిది మంది చేసే పనిని ప్రస్తుతం నలుగురు నిర్వర్తిస్తున్నారు. ఓ వైపు ఆరోగ్యశాఖ నుంచి సాధారణ ప్రసవాలు చేయాలంటూ ఒత్తిడి, మరోవైపు బాధితుల ముహూర్తాలకు అనుగుణంగా, నొప్పులు తట్టుకోలేమంటూ శస్త్రచికిత్స చేయాలంటూ డిమాండ్ చేయడంతో వైద్యులు నలిగిపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉద్యోగాలకు రాజీనామాలు చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల విధుల నుంచి తప్పుకున్న వారిలో ఒకరు స్వచ్ఛంద పదవి విరమణ చేయగా, మరొకరు ఆంధ్రప్రదేశ్‌కు బదిలీ అయ్యారు. మరో ఇద్దరు పని ఒత్తిడితోనే రాజీనామా చేసినట్లు ఇక్కడి సిబ్బంది తెలుపుతున్నారు.

**అన్నిదారులు జిల్లా ఆసుపత్రి వైపే..**

పెద్దాసుపత్రిలో తప్ప జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా ప్రసూతిసేవలకు సరియైన సదుపాయాలు లేవు. నలుదిక్కులు..కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, జన్నారం, సిరోంచకు చెందిన గర్భిణులందరు మంచిర్యాలకు రావాల్సిందే. మూడు సీహెచ్‌సీలు ఉన్నా సేవలు అందడం లేదు. బెల్లంపల్లిలో ఒకే ప్రసూతి వైద్యురాలితో నెట్టుకొస్తుండగా, లక్షెట్టిపేట, చెన్నూరులో ఒక్కరు కూడా లేరు. ప్రతిచోట సుమారు 30 పడకల సామర్థ్యం ఉన్నా చికిత్స అందించే వైద్యులు లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆయా ప్రాంతాల భారమంతా జిల్లా ఆసుపత్రిపై పడుతుండటంతో ఇక్కడ పనిచేసే ప్రసూతి విభాగం సిబ్బంది అవస్థలు పడాల్సివస్తోంది.

**నియామకాలు చేపడతాం**

**డా.అరవింద్, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షణాధికారి**

ప్రసూతి వైద్యురాళ్ల కొరత తీవ్రంగా ఉంది. ఒకేసారి నలుగురు వెళ్లిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వారు ఏ కారణంతో రాజీనామా చేసినా ప్రస్తుతం మాత్రం మిగతా వారికి భారంగా మారడంతో పాటు ఒత్తిడి పెరుగుతోంది. పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లి సంబంధిత వైద్యురాళ్ల నియామకానికి చర్యలు తీసుకుంటాం.

# రిమ్స్‌లో దాహం.. దాహం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పెద్దాసుపత్రి రిమ్స్ ఆసుపత్రికి నిత్యం 500లకుపైగా రోగులు, వారితో మరో 500 నుంచి 600 మంది సహాయకులు ఉంటారు. ఇంత పెద్ద ఆసుపత్రిలో తాగు నీటి వ్యవస్థ లేక రోగులు, వారి సహాయకులు అల్లాడిపోతున్నారు. రోగులు వారి సహాయకుల కోసం మొదటి అంతస్తులో శుద్ధ జల ప్లాంటును ఏర్పాటు చేశారు. కానీ అది మరమ్మతులకు గురవడంతో తాగు నీరు అందుబాటులో లేకుండా పోయింది. దాహం వేస్తే పైఅంతస్తుల నుంచి కింద అత్యవసర విభాగం ముందు స్వచ్ఛంద సంస్థల వారు ఏర్పాటు చేసిన చలివేంద్రం, శుద్ధ జల ప్లాంటు నుంచి సీసాల్లో నీటిని నింపుకొని వెళ్లాల్సి వస్తోంది. ఆసుపత్రిలో ఉన్న నాలుగు లిఫ్టులు పని చేయటం లేదు. పగలు ఎండ సమయంలో పైఅంతస్తు నుంచి కిందకి వచ్చి సీసాల్లో నీళ్లు తీసికెళ్లేందుకు అపసోపాలు పడుతున్నారు.

**నిరుపయోగంగా శుద్ధ జల ప్లాంటు**

రిమ్స్‌లో రోగులు, వారి సహాయకుల కోసం బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు రెండేళ్ల కిందట అందుబాటులోకి తీసుకొచ్చిన శుద్ధ జల ప్లాంటు ఇది. ప్రస్తుతం పాడైంది. మరమ్మతులు చేస్తే రోగులు, వారి సహాయకుల దాహం తీర్చటానికి ఇది ఎంతగానో ఉపకరిస్తుంది.

**ఇందులో నుంచి నీళ్లు రావు**

రిమ్స్‌లో శుద్ధ జలప్లాంటు వద్ద నీటిని పట్టుకోవటానికి గోడకు ఏర్పాటు చేసిన కళాయి(నల్లా) ఇది. దాహం తీర్చుకోవటానికి అక్కడికి వెళ్లి కుళాయి తిప్పితే నీళ్లు రాకా నిరాశగా వెనక్కి వెళ్లిపోతున్నారు.

**చలివేంద్రమే దిక్కు**

రిమ్స్‌లోని అత్యవసర విభాగం ఎదుట స్వచ్ఛంద సంస్థ వారు ఏర్పాటు



చేసిన శుద్ధ జల చలివేంద్రం ఇది. అక్కడే మైనారిటీ ఉద్యోగుల సంక్షేమం సంఘం ఏర్పాటు చేసిన మరో శుద్ధ జల ప్లాంటు సైతం ఉంది. రిమ్స్‌లోని రోగులు, వారి సహాయకులు, సందర్శకులు దాహం తీర్చుకోవటానికి ఈ చలివేంద్రం, శుద్ధ జల ప్లాంటును ఆశ్రయించాల్సి వస్తోంది.

**సీసాల్లో పట్టుకెళ్లాల్సిందే**

రిమ్స్ ఆసుపత్రిలో గ్రౌండ్ ఫ్లోర్ కాకుండా మూడు అంతస్తులు ఉన్నాయి. ఏ అంతస్తులోని వారికైనా దాహం వేస్తే కిందనున్న చలివేంద్రం లేదా శుద్ధ జలప్లాంటుకు వచ్చి తాగు నీటిని తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మూడో అంతస్తులోని వారైనా సరే రాత్రి పూట కూడా కింద నుంచి సీసాల్లో తాగు నీటిని తీసుకెళ్లక తప్పటం లేదు.

**ఇంటి నుంచే నీళ్ల డబ్బాలు**

రిమ్స్‌లో తాగు నీటి సౌకర్యం లేక ప్రసవం కోసం వచ్చిన గర్భిణి ఇలా చల్లటి నీటి కోసం ఇంటి నుంచే నీటి డబ్బాను తెచ్చుకొంది. నీళ్లు అయిపోగానే మళ్లీ ఇంటి నుంచి నీళ్లను తెచ్చుకున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

**నీటిని పరీక్షల కోసం పంపించాం**

**రాథోడ్ జైసింగ్, రిమ్స్ సంచాలకుడు**

శుద్ధ జలప్లాంటుకు సరఫరా అయ్యే నీళ్ల నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపించాం. ఆ ఫలితాల ఆధారంగా ఈ ప్లాంటు నుంచి నీటిని సరఫరా చేసి రోగులు, వారి సహాయకులకు తాగు నీటి ఇబ్బందులను తొలగిస్తాం.

# అక్రమాలు దండి.. ఆదాయానికి గండి

ఆసిఫాబాద్:జిల్లాలోని స్థిరాస్తి వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్లు వేస్తున్నారు. అక్రమంగా విక్రయించిన ప్లాట్లకు అడ్డదారుల్లో గుంటల చొప్పున రిజిస్ట్రేషన్లు సైతం చేయిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఈ విషయాలేవీ తెలియని అమాయకులు రియల్టర్ల మాటలు నమ్మి ప్లాట్లు కొనుగోలు చేసి జేబులు గుల్ల చేసుకుంటున్నారు. వ్యవసాయ భూములను ప్లాట్లుగా విక్రయించి, వీటిని తహసీల్దార్ కార్యాలయాల్లో గుంటల చొప్పున రిజిస్ట్రేషన్ చేయించి, ఒకటి రెండు రోజుల్లోనే నాలా అనుమతులు వచ్చేలా చేస్తున్నారు. పైకి అంతా బాగున్నా ఇళ్లు నిర్మించుకునే సమయంలో ప్లాట్ల మధ్య సరిహద్దు విషయంలో కొనుగోలుదారులు నానా అవస్థలు పడుతున్నారు.ప్రస్తుతం లింక్ డాక్యుమెంట్ ప్లాట్లకే పట్టణ ప్రణాళిక విభాగం(డీటీసీపీ) ద్వారా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ను తహసీల్దార్ కార్యాలయాల్లో చేస్తున్నారు. ధరణి వచ్చాక, అక్రమ లే అవుట్లపై ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడంతో రియల్టర్లు కొత్త మార్గం ఎంచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వ్యవసాయ భూముల్లో ఇబ్బడిముబ్బడిగా ప్లాట్లు వేస్తున్నారు. డీటీసీపీ అనుమతులు ఏవీ లేకుండానే కోర్టు ఉత్వర్వులు ఉన్నాయని నమ్మబలుకుతూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఈ తతంగం ఆసిఫాబాద్‌లో జిల్లా కేంద్రంతో పాటు, కాగజ్‌నగర్ పట్టణం బోరిగాం, బారేగూడ శివారు ప్రాంతంలో, రెబ్బెన, వాంకిడి, మండలాల్లో జోరుగా సాగుతోంది.

**స్టాంప్‌డ్యూటీ ఎగ్గొడుతున్నారు..**

ప్రభుత్వానికి స్టాంప్‌డ్యూటీ ఎగ్గొట్టడంతోపాటు, డీటీసీపీ నిబంధనలేవి పాటించకుండా, స్థిరాస్తి వ్యాపారులు ఈ దందా నడిపిస్తున్నారు. రిజిస్ట్రేషన్‌కు మార్కెట్ విలువలో ఏడున్నర శాతం చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రెబ్బెన మండలంలోని ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న నివాస ప్రాంతంలో నాలుగు గుంటల భూమికి మార్కెట్ విలువ రూ.2.42 లక్షలు ఉంటుంది. ఇందులో స్టాంప్‌డ్యూటీ రూ.15 వేల వరకు చెల్లించాలి. కానీ వ్యవసాయ భూమిగా చూపుతూ గుంటల్లో రిజిస్ట్రేషన్ చేస్తున్నందున ప్రభుత్వానికి వీరు రూ.500వరకే చెల్లిస్తున్నారు. ఈ విధంగా ప్రభుత్వానికి ఏటా రూ.కోట్లలో గండి పడుతోంది. సంవత్సరంలో వేలాది ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

**లేని ఇళ్లకు ఇంటి నెంబర్లు..**

ఇళ్లు నిర్మించకున్నా.. భూ యజమానులకు ఇంటి నెంబర్లను కేటాయిస్తున్నారు పంచాయతీ అధికారులు. జిల్లా వ్యాప్తంగా ఈ దందా జోరుగా నడుస్తోంది. అయినకాడికి వసూలు చేసి, నంబర్లు ఇవ్వడం వల్ల అక్రమ ప్లాట్లకు సైతం రిజిస్ట్రేషన్‌లు జరుగుతున్నాయి. మరోవైపు జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నాలుగు, అయిదు అంతస్థుల భవనాలను కడుతున్నా పంచాయతీ సిబ్బంది 'మామూలు'గా వ్యవహరిస్తున్నారు.

వాంకిడి మండలంలో 16, 66 సర్వే నంబర్లలో ప్లాట్లకు గుంటల చొప్పున రిజిస్ట్రేషన్లు చేస్తున్న తీరు. వాస్తవంగా ఇక్కడ వ్యవసాయ భూమి లేదు. అంతా ఖాళీ ప్లాట్లే. ఈ మండలంలో వందలాది ప్లాట్లు ఇదే విధంగా రిజిస్ట్రేషన్ చేస్తున్నారు.

**ఇల్లు కట్టుకోవాలంటే...**గుంటల చొప్పున భూములు తీసుకున్న ప్రజలు ఆయా స్థలాల్లో ఇళ్లు కట్టుకోవాలంటే మళ్లీ నాలా అనుమతులు తీసుకోవాల్సిందే. ఎల్‌ఆర్‌ఎస్ రుసుంతో పాటు, అదనంగా ప్లాట్ విలువలో 30 శాతం కంపోడింగ్ రుసుం కట్టాల్సి ఉంటుంది. ఇంత చేసినా ఈ ప్రదేశంలో కనీస సౌకర్యాలైన రహదారులు ఉండవు. సరిహద్దు వివాదాలు నిత్యం రాజకుంటూ ఉంటూనే ఉంటాయి.


# చింతలు తీర్చని ఇంకుడుగుంతలు

నిర్మల్ : పట్టణాల్లో జనాభా పెరిగిపోవడంతో శివారు ప్రాంతాలు నివాస కేంద్రాలుగా మారుతున్నాయి. ఏటా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రతి ఇంట్లో బోరు తవ్వుతుండటంతో భూగర్భ జలాల వినియోగం ఎక్కువవుతోంది. కానీ వృథా నీటిని భూమిలోకి ఇంకించే చర్యలు చేపట్టని కారణంగా భూగర్భ జలాలు ఏటా తగ్గుతున్నాయి. ఇంటి నిర్మాణ సమయంలోనే ఇంకుడుగుంత తవ్వకోవాలనే నిబంధన ఉన్నా.. నిర్మల్, భైంసా, ఖానాపూర్ పట్టణాల్లో అమలు కావడం లేదు. వీటి నిర్మాణాల పేరిట రూ.లక్షలు వసూలు చేస్తున్నా, నిర్మాణాలపై 'పుర' అధికారులు నిర్లిప్తత చూపిస్తున్నారు. దీంతో సదరు ఇంటి యజమానులు నిర్మించుకునేందుకు ముందుకురావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం జలవిధానం ముసాయిదాలో పట్టణాల్లో ఇంకుడుగుంతల నిర్మాణం తప్పనిసరిగా చేర్చినా.. ప్రయోజనం కనిపించడం లేదు.

ఇదీ పరిస్థితి.. పట్టణాల్లో ఏటా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా.. ఇంకుడుగుంతలను విస్మరిస్తున్నారు. ఫలితంగా భూగర్భజలాలు పడిపోయి నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. గృహ నిర్మాణ అనుమతి సమయంలో ఇంకుడుగుంత నిర్మాణానికి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అదనంగా ఆర్‌డబ్ల్యూహెచ్‌ఎస్ కింద ప్రతి చదరపు మీటరుకు రూ.15 చొప్పున డిపాజిట్లు తీసుకుంటారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి ఎంతలేదన్నా (స్థల విస్తీర్ణం ప్రకారం) కనీసం రూ.2 వేల వరకు డిపాజిట్ల పేరిట వసూలు చేస్తున్నారు. అనుమతి తీసుకున్న నిర్మాణదారుడు ఆ ఇంకుడుగుంత తవ్వకుంటే.. వాటిని అధికారులు పరిశీలించి తిరిగి ఆ డిపాజిట్ నగదును సదరు నిర్మాణదారుడికి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో ఎక్కడా ఇలా జరగడం లేదు.

1 మార్చి 2019 నుంచి మార్చి 2022 వరకు.. నిర్మల్‌లో 1,150 వరకు గృహ నిర్మాణాలు జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఈ లెక్కన మూడేళ్లలో ఇంకుడుగుంతల కోసం రూ.23 లక్షలు వసూలు చేశారు. ఇలా భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనూ కొత్తగా నిర్మించుకునే వారి నుంచి డిపాజిట్ పేరిట డబ్బులు వసూలు చేశారు.

**లేఖ రాసినా ప్రయోజనం శూన్యం**



పట్టణాల్లోని ఇళ్లల్లో ఇంకుడుగుంతలు తవ్వకోవాలని ఇటీవల భూగర్భ జలశాఖ అధికారులు ఆయా మున్సిపల్ కమిషనర్లకు లేఖలు రాశారు. ప్రస్తుత సమయంలో వీటిని తవ్విస్తే రానున్న వర్షాకాలంలో వాన నీరు భూమిలోకి ఇంకే అవకాశం ఉంటుందని, కొత్తగా నిర్మించే ప్రతి ఇంట్లోనూ వీటిని నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆ లేఖలో పేర్కొన్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం కనిపించడం లేదు.

**అవగాహన కల్పిస్తున్నాం**

**నవీన్‌కుమార్, టీపీఎస్, నిర్మల్**

కొత్తగా నిర్మిస్తున్న ఇళ్లల్లో ఇంకుడుగుంతల తవ్వకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. భవన నిర్మాణ అనుమతులు తీసుకునే సమయంలో వీటి ప్రాధాన్యతను వివరిస్తున్నాం. నీటి ఆవశ్యకత తెలుసుకున్న యజమానులు వాటిని నిర్మించుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

# బోధకుల కొరత... విద్యార్థుల వెత

మంచిర్యాల : ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో చేరితే అయితే ఉద్యోగం, లేదంటే స్వయం ఉపాధి లభిస్తుందన్న భరోసాతో చేరిన విద్యార్థులకు నిరాశే ఎదురవుతోంది. ఎంచుకున్న ట్రేడ్‌లో ప్రవేశం పొందినా, బోధించేవారు లేక, పరీక్షలు సమీపిస్తుండటంతో మరింత ఆందోళన చెందుతున్నారు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులు.విశాలమైన గదులు, మైదానంలో విద్యార్థులతో కళకళలాడాల్సిన ఐటీఐ కళాశాల వెలవెలబోతోంది. ఇక్కడ స్వయం ఉపాధితో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగం సాధించేలా ఆరు ట్రేడ్లు అందుబాటులో ఉన్నాయి. ఎలక్ట్రీషియన్, డీఎం సివిల్, డ్రెస్‌మేకింగ్, స్టెనో, కోపా ట్రేడ్‌లలో మొత్తం 220మంది ప్రవేశం పొందారు. నిన్న మొన్నటి వరకు వరకు బోధకులు, అతిథి అధ్యాపకులు పనిచేసినా.. జీవో 317 బదిలీల్లో కొందరు, ఇతర కారణాలతో మరికొందరు బోధకులు కళాశాలను వదిలి వెళ్లడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. బోధన విభాగంలో తొమ్మిది పోస్టులకు గాను ప్రిన్సిపల్ ఒక్కరే రెగ్యులర్. టెక్నికల్ ఆఫీసర్ డిప్యూటేషన్‌పై ఇక్కడ పనిచేస్తున్నారు. అంటే మొత్తం ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. విద్యార్థుల సంఖ్య తగ్గిపోయి గదులకు తాళాలు కనిపిస్తున్నాయి. బోధకులను నియమించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నాం**

**– సీతారాములు, ఆర్‌డీడీ, ఐటీఐ**

కళాశాలల్లో బోధకుల కొరతను అధిగమించేలా తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నాం. నిపుణులతో మల్టీమీడియా తరగతులు నిర్వహిస్తున్నారు. ఖాళీలు భర్తీ అయ్యేలా కూడా ప్రతిపాదనలు ప్రభుత్వానికి నివేదించాం. ఉట్నూరుకు బదిలీ అయిన బోధకురాలిని తిరిగి ఆదిలాబాద్‌కు రప్పించే ఏర్పాట్లు చేస్తాం.

**బోధకుల కోసం నిరీక్షణ.!**

వీరంతా డ్రెస్ మేకింగ్ ట్రేడ్‌లో చేరిన బాలికలు. టైలరింగ్ యంత్రాలపై కుట్లు, అల్లికలు వంటివి నేర్చుకోవాల్సిన వీరు బోధకులు లేక ఇలా వచ్చి తరగతి గదిలో కూర్చుండి వెళ్తున్నారు. ఇక్కడ పనిచేసే బోధకురాలు ఉట్నూరు కళాశాలకు బదిలీ అయ్యారు. విచిత్రమేటంటే అక్కడ కోర్సు లేకున్నా ఆమె 317జీవో కింద స్థానచలనం కల్పించడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

**కంప్యూటర్ ల్యాబ్‌కు తాళం!**కోపా ట్రేడ్‌కు మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో.. 40మంది ఇందులో చేరారు. బోధకులు లేకపోవడంతో కంప్యూటర్ గదికి తాళం వేసి ఉంచుతున్నారు. విద్యార్థులు థియరీ తరగతులు వింటూ ప్రయోగ తరగతులకు దూరమవుతున్నారు.

**ఆరు ట్రేడ్లు.. ఏడు ఖాళీలు**

ఇది జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ కళాశాల). ఇక్కడ ఆరు ట్రేడ్లు ఉండగా.. ప్రిన్సిపల్ ఒక్కరే పనిచేస్తున్నారు. ట్రైనింగ్ ఆఫీసర్ డిప్యూటేషన్‌పై పనిచేస్తుండగా.. మిగిలిన ఆరు డిప్యూటీ ట్రైనింగ్ ఆఫీసర్లు, ఒక టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అతిథి అధ్యాపకులు సైతం వేతనం తక్కువ కావడంతో వారూ వెళ్లిపోయారు.

**ఆన్‌లైన్ బోధనతో సరి**

ఆయా ట్రేడ్ల విద్యార్థులకు షెడ్యూల్ వారీగా ప్రసారమయ్యే మల్టీమీడియా (ఆన్‌లైన్) తరగతులు వినిపిస్తున్నారు. నెట్‌వర్క్ సమస్యతో సరిగ్గా అర్థం కావడంలేదని విద్యార్థులంన్నారు.

# మల్లన్న కీర్తి నలుదిశలా కన్పించేలా..

చేర్యాల: తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోనూ లక్షలాది మంది భక్తులకు కొంగు బంగారమైన కొమురవెల్లి మల్లికార్జునస్వామి కీర్తి నలుదిశలా కన్పించేలా ఆలయ వర్గాలు చర్యలు చేపట్టాయి. పరమశివుడికి ప్రతిరూపమైన మల్లన్న కొలువైన గుట్ట చివరన ఉన్న గుట్టపై సీఎం కేసీఆర్ ఆలోచన మేరకు త్రిశూలం, డమరుకం నిర్మాణ పనులు షురూ అయ్యాయి. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. గుట్ట చిట్టచివరన నిర్మించే త్రిశూలం, డమరుకం సుదూరంలోని వారికి కనిపించేలా విద్యుత్తు దీపాలు అమరుస్తారు. రాత్రి వేళ 10 కి.మీ. దూరంలోని వారికీ ఆ ఆయుధాలు దర్శమిస్తాయి.

రూ.68లక్షలతో..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక, భారాస ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం తొలిసారిగా సీఎం కేసీఆర్ 2014 డిసెంబరు 21న మల్లికార్జునస్వామి కల్యాణోత్సవానికి హాజరయ్యారు. అనంతరం ఆలయ వర్గాలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో జరిపిన సమీక్షలో గుట్టపై త్రిశూలం, డమరుకం ఏర్పాటు చేస్తే బాగుంటుందని సీఎం సూచించారు. అప్పటి నుంచి నిర్మాణానికి చర్యలు చేపట్టినా నిర్మాణ సామగ్రి గుట్టపైకి తీసుకెళ్లే మార్గం లేకపోవడంతో గుత్తేదారులు ముందుకు రాలేదు. ఇటీవల ఘాట్‌రోడ్డు నిర్మాణం పూర్తయ్యాక మళ్లీ టెండరు పిలిచారు. రూ.68 లక్షలతో కాంక్రీటుతో నిర్మాణానికి దేవాదాయ శాఖ పచ్చజెండా ఊపింది.

చుక్కలాది పర్వతం సమీపంలో..

సుమారు 300 అడుగులకు పైగా మల్లన్న గుట్ట ఎత్తు ఉండగా, చిట్టచివరన ఉన్న సుత్‌మాన్ గుండు, చుక్కలాది పర్వతం పక్కనే



త్రిశూలం, డమరుకం నిర్మాణం చేపడుతున్నారు. ఆ పనులు చురుకుగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలోని బండరాళ్లను పగులగొట్టి చదును చేశారు. ఆ ప్రాంతంలో బండను తొలిచి ఇనుప చువ్వలు లోపలికి అమర్చి, కాంక్రీటుతో మూడు స్లాబులు (30 అడుగుల ఎత్తు) నిర్మించి, దానిపైన 25 అడుగుల ఎత్తుతో త్రిశూలం, డమరుకం నిర్మించనున్నారు. కాంక్రీటు పనులు పూర్తయ్యాక, త్రిశూలం కింది నుంచి పై వరకు విద్యుత్తు దీపాలు బిగిస్తారు.

బ్రహ్మోత్సవాల్లోపు పనులు పూర్తి

బాలాజీ, ఈవో, కొమురవెల్లి

ఇటీవలే పనులు మొదలయ్యాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. ఆ దిశగా వేగంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

# పది లెక్క.. ఇక పక్కా!

ఆసిఫాబాద్ : పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నిగ్గు తేల్చేందుకు విద్యాశాఖ దృష్టి సారించింది. బోగస్ విద్యార్థులను ఏరి పారేసేందుకు చర్యలు చేపట్టింది. విద్యార్థుల హాజరు పట్టికకు, యూడైస్‌కు లెక్క సరిచేసేందుకు తాజాగా పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. పదో తరగతి పరీక్షలకు హాజరు కాబోయే విద్యార్థుల వివరాలు ఏకీకృత జిల్లా పాఠశాల విద్యా సమాచారం (యూడైస్) తప్పనిసరిగా నమోదై ఉండాలనేది ఈ ఉత్తర్వుల సారాంశం. ఇందులో నమోదైన పదో తరగతి విద్యార్థులు మాత్రమే 2023–24 విద్యా సంవత్సర పరీక్ష ఫీజు చెల్లించేందుకు అర్హులుగా ప్రకటించింది. ఈ నెల 28లోగా ప్రధానోపాధ్యాయులు పది విద్యార్థులందర్నీ విధిగా యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాలని ఆదేశించింది.అనుమతి లేని పాఠశాలల వారు విద్యార్థుల ప్రవేశాలు తీసుకొని అనధికారికంగా పదో తరగతులను నడిపిస్తున్నారు. ఆఖరు సమయంలో తమ విద్యార్థులను మరో పాఠశాల నుంచి పరీక్ష ఫీజు చెల్లించే వారు. అక్కడి నుంచే నామినల్ రోల్స్‌ను ప్రభుత్వ పరీక్షల విభాగానికి అందించే వారు. ఈ తతంగానికి అడ్డుకట్ట వేసేందుకే.. ఈసారి విద్యార్థులను యూడైస్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించింది. ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో నమోదు అయిన వారే పరీక్ష ఫీజు చెల్లించేందుకు అర్హులుగా ప్రకటించింది. దీంతో అనుమతి పొందని ప్రైవేటు పాఠశాలల ఆటకట్టించడంతోపాటు విద్యార్థుల లెక్కను పక్కాగా తేల్చేందుకు రంగం సిద్ధం చేసింది.

జాగ్రత్త పడనున్న ప్రధానోపాధ్యాయులు..

విద్యాశాఖ ఉత్తర్వులతో.. జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలతోపాటు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులూ హైరానా పడుతున్నారు. అనధికారికంగా పదో తరగతి ప్రవేశాలు పొందిన ప్రైవేటు వారు వెంటనే విద్యార్థులను మరో పాఠశాలలో నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్(ఎఫ్‌ఆర్‌ఎస్) విధానంలో విద్యార్థుల హాజరు నమోదు ప్రారంభమవడంతో.. రిజిస్టరులో పేరుండి దీర్ఘకాలికంగా పాఠశాలలకు రాని విద్యార్థుల పేర్లను తొలగించి ఆన్‌లైన్ డ్రాప్ బాక్స్‌లో వేసేందుకు యోచిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పడిపోకుండా ఉండేందుకు తొమ్మిదో తరగతి నుంచి ఇప్పటి వరకు హాజరుకాని వారు కూడా రిజిస్టరుతోపాటు యూడైస్‌లో నమోదై ఉన్నారు. విద్యార్థుల సంఖ్యతో ఉపాధ్యాయుల పోస్టుల సంఖ్య ముడిపడి ఉండటంతో.. కొందరు ఈ విధానాన్ని కొనసాగిస్తున్నారు. పది పరీక్ష ఫీజు చెల్లించే సమయంలో వీరి పేర్లను తొలగించి ఆన్‌లైన్ డ్రాప్ బాక్స్‌లో వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కాగా ఈ ఏడాది జిల్లాలో పదోతరగతి పరీక్షలకు ఎంతమంది హాజరు కానున్నారో ఫీజులు చెల్లించినపుడే లెక్క తేలుతుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

నమోదు ఇలా..

విద్యార్థి వ్యక్తిగత పూర్తి వివరాలను యూడైస్ ప్లస్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. అడ్మిషన్ రిజిస్టరు ప్రకారం.. విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, తరగతి, తల్లిదండ్రుల పేర్లు, ఆధార్ సంఖ్య, చిరునామా, చరవాణి సంఖ్య, ఆర్థికస్థితి, కులం, ప్రస్తుత పాఠశాల గతంలో చదివిన పాఠశాల తదితర సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదైన ఈ వివరాలనే నామినల్ రోల్‌లో తీసుకుంటారు.

అలక్ష్యం చేయొద్దని ఆదేశించాం

పార్శి అశోక్, జిల్లా విద్యాధికారి

పదో తరగతి విద్యార్థులంతా విధిగా యూడైస్‌లో నమోదు కావాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఆదేశించారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రధానోపాధ్యాయులందరికీ అత్యవసర సమాచారంగా చేరవేశాం. ఈ నెల 28లోగా విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నిర్దేశిత పోర్టల్‌లో నమోదు చేయాలి. పొరపాట్లకు తావులేకుండా చూడాలి. ఇలా నమోదు కాని విద్యార్థి పరీక్ష ఫీజు చెల్లింపునకు అనర్హులు అవుతారు. ప్రధానోపాధ్యాయులు ఈ విషయంలో అలక్ష్యం చేయవద్దని ఆదేశించాం.

# వలసల జోరు



సిద్దిపేట : ఎన్నికల వేళ 'ఏ నిమిషానికి ఏమి జరుగునో.. ఎవరూహించెదరు' అనే పాటను గుర్తు చేసుకోవాల్సిందే! అప్పటి వరకు తమను అంటిపెట్టుకొని తిరిగిన నాయకులు, కార్యకర్తలు.. మరుక్షణం ప్రత్యర్థి పార్టీ తీర్థం పుచ్చుకోవడంతో కంగుతింటున్నారు. ఓట్ల పండుగ.. డిమాండ్ల తీర్చుకునేందుకు చక్కటి వేదికగా భావించే వారు అనేకం. గల్లీ స్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు కార్యకర్తలు, నాయకులు.. అందివచ్చిన అవకాశాలను అనుకూలంగా మార్చుకునేందుకు ఉద్యుక్తులవుతున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఇటీవల చేరికల పర్వం మొదలైంది. రోజుల వ్యవధిలో పార్టీలు మారుతుండటం చర్చనీయాంశమవుతోంది. ఒక రోజు పార్టీలో కొనసాగి.. ఆ తెల్లారే మరో వైపు చూస్తున్న సందర్భాలు తారసపడుతున్నాయి. బుజ్జగింపుల కారణంగా తిరిగి సొంతగూటికి చేరుతున్న సంఘటనలు సహజంగా మారాయి. పలువురు తాము కొనసాగే పార్టీల్లో ప్రాధాన్యత తగ్గి.. ఆశించిన స్థానం దక్కక భంగపాటుకు గురై ఇతరుల వైపు మొగ్గు చూపుతున్నారు. నోటిఫికేషన్ వెలువడిన తరువాత చేరికల పర్వం మరింతగా ఊపందుకోనున్న దృష్ట్యా పార్టీల ప్రతినిధులు అప్రమత్తమవుతున్నారు. ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ అనుచర వర్గాన్ని కాపాడుకునేందుకు అన్ని ప్రయత్నాలు మొదలెట్టారు. అలకబూనిన వారిని దారికి తెచ్చేందుకు ఆపసోపాలు పడుతున్నారు.

దుబ్బాకలో జోరు

దుబ్బాక పరిధిలో జోరుగా చేరికలు సాగుతున్నాయి. ప్రధాన పార్టీల్లో రోజుకో చేరిక చర్చనీయాంశమవుతోంది. భూంపల్లి–అక్బర్‌పేట మండలం రామేశ్వరంపల్లి సర్పంచి సుగుణ భాజపా నుంచి భారాసలోకి చేరారు. వివిధ సందర్భాల్లో ఇతర పార్టీల నాయకులు కారెక్కుతున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. ముఖ్య నేతల సమక్షంలో ఈ చేరికలు కొనసాగుతున్నాయి. భాజపా అందుకు దీటుగా పావులు కదుపుతోంది. భారాసకు చెందిన తొగుట మండలం చందాపూర్ సర్పంచి నర్సింలు, చేగుంట మండల భారాస అధ్యక్షుడు వెంగళరావు, రాయపోల్ వైస్ ఎంపీపీ రాజిరెడ్డి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ రవీందర్ కమలం గూటికి చేరారు. తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజిరెడ్డి, వివిధ మండలాల నుంచి వార్డు సభ్యులు భారాస నుంచి భాజపాలోకి చేరిన జాబితాలో ఉన్నారు. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి ఇంకా ఖరారు కాకపోవడంతో స్తబ్ధత నెలకొంది.


ఏకగ్రీవాలు

సిద్దిపేటలో భిన్న వాతావరణం స్పష్టమవుతోంది. వివిధ గ్రామాల కుల, యువజన, ఇతర సంఘాలు.. భారాసకు మద్దతుగా నిలుస్తామంటూ బహిరంగంగా ఏకగ్రీవ తీర్మానాలు అందిస్తున్నాయి. చిన్నకోడూరు మండలం శంకరాయకుంట గ్రామం మద్దతు పలికింది. భాజపా, కాంగ్రెస్ పార్టీల తరఫున అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో ఆశావహుల్లో సందిగ్ధత నెలకొంది. సలేంద్రి గ్రామానికి చెందిన కొందరు భారాస కార్యకర్తలు, నారాయణరావుపేట మండలం గోపులాపూర్ చెందిన యువకులు, నాయకులు భాజపాలో చేరారు. చిన్నకోడూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మిట్టపల్లి గణేశ్, పలువురు భాజపా నాయకులు, నంగునూరు మండల భాజపా ప్రధాన కార్యదర్శి జీవన్‌రెడ్డి, గంగాపూర్‌కు చెందిన స్వేరోస్ సంస్థ సభ్యులు కారెక్కారు.

అంతర్గత సమావేశాలు

గజ్వేల్ నియోజకవర్గంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. భారాస, కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. మూడు పార్టీల్లో పోటాపోటీగా చేరికలు సాగుతున్నాయి. ఎవరికి వారుగా అంతర్గత సమావేశాలు నిర్వహిస్తూ బలం పెంచుకునేందుకు యత్నిస్తున్నారు. ఉద్యమకారులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులు.. ఓ పార్టీలో సముచిత స్థానం లేదంటూ ఇటీవల అసమ్మతి రాగం వినిపించారు. ఇప్పటికే రెండుమార్లు బహిరంగంగా సమావేశమయ్యారు. తమకు నచ్చిన నేత పోటీలో నిలబడితే మద్దతు ఇస్తామంటూ కొందరు ప్రకటించడం గజ్వేల్‌లో చర్చనీయాంశమైంది. మరోవైపు చేరికల సమయంలో ఆయా పార్టీలు ముందస్తు హామీలు గుప్పిస్తున్నాయి. అధికారంలోకి వస్తే పథకాలను తొలి ప్రాధాన్యతగా వర్తింపజేస్తామంటూ ఆకర్షిస్తున్నారు. ఇటీవల హుస్నాబాద్ నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీల్లో చేరికల పర్వం మొదలైంది. భారాస, కాంగ్రెస్, భాజపాలు.. పావులు కదుపుతున్నాయి. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూల్మిట్ట మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అనుకూలుర వైపు మళ్లుతున్నారు.

# ప్రశాంతతే లక్ష్యం.. చైతన్యమే ధ్యేయం




మెదక్: షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి జిల్లాలో అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణలో తలమునకలయింది. అటు ఓటరు చైతన్య కార్యక్రమాలు, పోలింగ్ శాతం పెంపు, కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పనపై దృష్టి సారించారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో నిర్వహించే విధులపై సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. మరో వైపు పోలీస్‌శాఖ ముమ్మరంగా తనిఖీలు చేపడుతూ మద్యం, నగదును స్వాధీనం చేసుకుంటోంది. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఈ అంశంపై కథనం. జిల్లాలోని మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 579 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.షెడ్యూల్ రాగానే రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించి ఎన్నికల నియమావళి గురించి అవగాహన కల్పించారు. సహాయ వ్యయ పర్యవేక్షకులు, వీడియో సర్వైలెన్స్, వీడియో చిత్రీకరణ, అకౌంటింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ, ఎంసీసీ కమిటీలను అందుబాటులోకి తీసుకువచ్చారు.

సిబ్బందికి శిక్షణ

మరోవైపు పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. జోనల్, సెక్టోరల్, పోలీస్ అధికారులకు ఒక దఫా శిక్షణ ఇచ్చారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ప్రతి కేంద్రానికి పోలింగ్ అధికారి(పీవో), సహాయ పోలింగ్ అధికారి(ఏపీవో), ఇతర పోలింగ్ అధికారులు(ఓపీవో)లకు శిక్షణ ఇవ్వనున్నారు. వీరికి జిల్లా స్థాయిలో శిక్షణ అనంతరం మరో సారి పోలింగ్ కేంద్రాలకు వెళ్లే ముందు ఇస్తారు. మరో వైపు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై దృష్టి సారించారు. దివ్యాంగుల కోసం ర్యాంపుల నిర్మాణం, శౌచాలయాలను అందుబాటులోకి తీసుకరావడం, తాగునీటి వసతిని కల్పించనున్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఓటు నమోదు, వివిధ యాప్‌ల గురించి అవగాహన కల్పించేలా ఆయా చోట్ల ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లను ఏర్పాటు చేశారు.

డిజిటల్ వాహనం ఏర్పాటు చేసి..

ఎన్నికల్లో ఓటర్లు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఇప్పటికే పలు కార్యక్రమాలను చేపడుతున్నారు. తాజాగా సాంస్కృతిక కళా సారథుల బృందం ఆధ్వర్యంలో డిజిటల్ వాహనం ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నారు. కళాకారులు పాటల రూపంలో చైతన్యం తీసుకవస్తున్నారు. జిల్లా స్వీప్ పాట, కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించిన పాటను ప్రదర్శిస్తున్నారు. సీ–విజిల్, యాప్, ఓటరు నమోదుపై గ్రామాలు, వార్డుల్లో అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గురువారం పాలనాధికారి రాజర్షిషా, ఎస్పీ రోహిణిప్రియదర్శిని మెదక్ మండలం రాజ్‌పల్లి, మెదక్ పట్టణంలోని దాయరలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

జోరుగా తనిఖీలు

ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా అడ్డుకట్ట వేసేందుకు పోలీస్‌శాఖ చర్యలు చేపడుతోంది. ఇప్పటికే ఏడు చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. వీటి మీదుగా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మరో వైపు పోలీసులు పట్టణాలు, పల్లెల్లో గొలుసు దుకాణాలపై దాడులు చేస్తున్నారు. జిల్లాలో పలు చోట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గతంలో నేరాలు నమోదైన అనుమానిత వ్యక్తుల బైండోవరు ప్రక్రియ చేపట్టారు. ఠాణాల పరిధిలో మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చి...సొంత పూచీకత్తుపై వదిలిపెడుతున్నారు. సామాజిక మాధ్యమాలపై ప్రత్యేక నిఘా సారించారు. వైషమ్యాలు పెంచే, రెచ్చగొట్టే పోస్టులపై దృష్టి సారిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే ఫిర్యాదుల ఆధారంగా కేసులు నమోదు చేయనున్నారు.

# వ్యయం పరిమితికి మించితే అనర్హతే!

సంగారెడ్డి : శాసన సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఖర్చు రూ.40లక్షలకు పరిమితం చేసింది ఎన్నికల సంఘం. ఇంతకంటే ఎక్కువ ఖర్చు చేస్తే అభ్యర్థి అనర్హులవుతారు. ఈ ఖర్చుకూ ఓ లెక్కుంది. నామినేషన్లు వేసినప్పటి నుంచి అభ్యర్థి ఖర్చును లెక్కిస్తారు. అభ్యర్థి రోజువారీ లెక్కలు రిటర్నింగ్ అధికారులకు సమర్పించాల్సి ఉంటుంది. నామినేషన్లకంటే ముందు అయిన ఖర్చును పార్టీ ఖాతా కింద జమకడతారు. అభ్యర్థుల ఖర్చులో నగదు రోజుకు రూ.10వేలకు మించొద్దన్న నిబంధన ఉంది. డిజిటల్ పద్ధతిలో మాత్రం రూ.40లక్షల పరిమితిలో ఎంతైనా ఖర్చు చేయవచ్చు. ప్రతి చెల్లింపునకు రసీదు తప్పనిసరిగా ఉండాలి. ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా ను తెరవాల్సి ఉంటుంది. ఆ ఖాతా నుంచే ఎన్నికల వ్యయానికి సంబంధించిన చెల్లింపులు జరగాలి. ఎన్నికల ఖర్చుకు సంబంధించిన డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందో అభ్యర్థులు చెప్పాల్సి ఉంటుంది.

ప్రత్యేక బృందాలుఅభ్యర్థుల ఖర్చులను పరిశీలించేందుకు షాడో బృందాలు ఉంటాయి. పార్టీ పరంగా జరిగే కార్యక్రమాలు, ఇతర వేడుకల్లో అభ్యర్థులను ఈ బృందాలు అనుసరిస్తాయి. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో ఇప్పటికే షాడో బృందాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు లెక్క చూపకుండా చేసే ఎన్నికల వ్యయాలను నమోదుచేస్తూ ఎన్నికల సంఘానికి ఈ బృందాలు నివేదిక అందజేస్తాయి.

# కలవరపెడుతున్న వైరస్

ఆసిఫాబాద్ : ఇప్పటికే జిల్లాలో విష జ్వరాలు, డెంగీ విస్తృతంగా వ్యాపిస్తూ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతుండగా తాజాగా ఇతర వైరస్‌లు తోడై కలవరపెడుతున్నాయి. వాతావరణంలో చోటు చేసుకుంటున్న ఈ వైరస్‌లు వ్యాపించి చిన్నా పెద్ద తేడా లేకుండా అందరిని రోగాల బారిన పడేస్తున్నాయి. పిల్లల్లో మమ్స్(గవద బిళ్లలు) ఉండి జ్వరం, పెద్దల్లో జ్వరంతో పాటు తీవ్ర దగ్గు ఉంటోంది. జిల్లా వ్యాప్తంగా ఈ వైరస్ వ్యాపించటంతో బాధితులు రోజువారీ పనులు సైతం వదులుకొని ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. ప్రధానంగా చిన్నారులు ఎక్కువ మంది గవదబిళ్లలతో అవస్థలు పడుతుండటంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. రిమ్స్‌కు నిత్యం 10 నుంచి 15 మంది పిల్లలు చికిత్సకు వస్తున్నారు. ఇక ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లే వారి సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. చలి తీవ్రత పెరగడంతో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

ప్రస్తుతం వర్షాకాలం పూర్తయి చలికాలం ప్రారంభం అవుతోంది. క్రమంగా చలి పెరుగుతోంది. వాతావరణలో చోటు చేసుకున్న మార్పుల వల్ల గాలిలో తేమ శాతం అధికంగా ఉంటోంది. దీంతో పలు రకాల వైరస్‌లు వాటి ఉనికిని చాటుకొని ప్రజలను వ్యాధుల బారిన పడేస్తున్నాయి. వైరస్‌లు వృద్ధి చెందటానికి అనువైన వాతావరణం ఉండటంతో జిల్లాలో డెంగీ, విష జ్వరాలతో పాటు దగ్గు, శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి.

కారణాలివీ..గవదబిళ్లలు అంటే చెవి కింది గ్రంథులు వాచి నొప్పి పెడతాయి. సరిగా అన్నం తినలేరు. ఏమీ తాగలేరు. జ్వరం కూడా ఉంటుంది. వీటిని పెరోటైటిస్(మమ్స్)గా వైద్యులు పేర్కొంటారు. సాధారణంగా ఇది రోగనిరోధక శక్తి తక్కువ ఉన్న వారిలో, పోషకాహార లోపాలు ఉన్న వారిలో కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్ల వల్ల సోకుతంది. పెరోటైటిస్ గ్లాండ్స్‌కు ఇన్‌ఫెక్షన్ సోకటం వల్ల ఈ సమస్య



ఏర్పడుతుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. స్ట్రెప్టోకోకల్, స్టఫైలో కోకల్, ఈ–కోలై మొదలైన బ్యాక్టీరియాతో పాటు ఇన్‌ఫ్లూయెంజా, కొక్సాకీ వైరస్, సైటో మెగాలో వంటి వైరస్‌లతో కూడా ఇన్‌ఫెక్షన్‌కు గురై దీని బారిన పడతారంటున్నారు. కొన్ని సందర్భాల్లో డెంటల్(దంతాల) ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు ఉన్నాయి.

జాగ్రత్తలు తీసుకుంటే సరి

మిట్పల్లివార్ శ్రీధర్, ఎన్‌సీడీ అధికారి


పరిశుభ్రత పాటించి కరోనా సమయంలో తీసుకున్న జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి వ్యాధుల బారిన పడకుండా ఉంటాం. వాతావరణ మార్పుల వల్లనే ఈ వ్యాధులు ప్రబలుతున్నాయి. మమ్స్ బారిన పడ్డ చిన్నారులు సాధారణ చికిత్స తీసుకుంటే వారంలోపు నయం అవుతాయి. పెద్దలు మాత్రం శ్వాసకోశ సమస్యలు, తీవ్ర దగ్గు ఉంటే వైద్యులను సంప్రదించి విధిగా చికిత్స చేయించుకోవాలి.

# సింగరేణి.. సౌర వెలుగుల వేణి

చెన్నూరు : సింగరేణి ప్రాంతాల్లో కాలుష్యాన్ని నివారించేందుకు యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపడుతూ కార్మిక ప్రాంతాల్లో పెద్దఎత్తున చెట్లు పెంచుతూ పర్యావరణ పరిరక్షణలో తనవంతు పాత్ర పోషిస్తోంది. బొగ్గు గనులు విస్తరించిన పరిసర ప్రాంతాల్లో సౌర విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తూ విద్యుత్తు వెలుగులు పంచుతోంది. అందులో భాగంగానే శ్రీరాంపూర్ ఏరియాలోని చెన్నూరు మండలంలోని శివలింగాపూర్ సింగరేణి స్థలంలో సౌర విద్యుత్తు కేంద్రం పనులు ఇదివరకే చేపట్టగా.. ఎల్లక్కపేటలో మరో 27.5 మెగావాట్ల మరోకేంద్రం ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. సింగరేణి అధికారులు ఇటీవల స్థలాన్ని పరిశీలించారు.

శివలింగాపూర్‌లో సాగుతున్న పనులు..

చెన్నూరు మండలం శివలింగాపూర్ గ్రామ సమీపంలో సింగరేణి సంస్థకు చెందిన 55 ఎకరాల స్థలంలో రూ. 64.5 కోట్లతో చేపట్టిన 11 మెగావాట్ల సౌర విద్యుత్తు కేంద్రం పనులు సాగుతున్నాయి. పుణెకు చెందిన ఎన్‌రిచ్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ పనులు చేపడుతోంది. అయిదు నెలల క్రితం పనులు ప్రారంభించగా చకచకా కొనసాగుతున్నాయి. సౌర పలకలను అమర్చేందుకు స్టాండ్ల ఏర్పాటు ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. సామగ్రి సరఫరాలో కొంత జాప్యంతో మొదట 5 మెగావాట్ల పనులు పూర్తిచేసి వచ్చేనెల 30లోపు విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు నిర్ణయించారు ఆ తర్వాత మిగతా ఆరు మెగావాట్ల పనులు పూర్తిచేస్తారు. ఇక్కడి నుంచి ఉత్పత్తి చేసిన విద్యుత్తును



ఎన్‌పీడీసీఎల్‌కు అనుసంధానం చేస్తారు.

ఎల్లక్కపేటలో 27.5 మెగావాట్లు

చెన్నూరులోని ఎల్లక్కపేటలో మూతపడిన 1ఇంక్లైన్ బొగ్గుగని ప్రాంతంలో మరో సౌర విద్యుత్తు కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియను ప్రారంభించారు. సుమారు రూ.160 కోట్ల అంచనా వ్యవయంలో 27.5 మెగావాట్ల కేంద్రాన్ని నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇటీవల సింగరేణి ఉన్నతాధికారులు స్థలాన్ని పరిశీలించారు. డిసెంబరు వరకు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి వచ్చే ఏడాదిలో నిర్మాణ పనులు ప్రారంభించేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు. చెన్నూరు ప్రాంతంలో సౌర కేంద్రాల ఏర్పాటు ద్వారా ప్రత్యేకంగా, పరోక్షంగా కొంతమందికి ఉపాధి లభించే అవకాశాలుంటాయి.

ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి

సంజీవరెడ్డి, జీఎం, శ్రీరాంపూర్ ఏరియా

సౌర విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుపై సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. అందులో భాగంగా చెన్నూరు ప్రాంతంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. శివలింగాపూర్‌లో పనులు సాగుతుండగా.. ఎల్లక్కపేటలో ఏర్పాటు చేయబోయే విద్యుత్తు కేంద్రానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంది.

# దివ్యమైన ఆలోచన.. ప్రజాస్వామ్యానికి రక్షణ

చిట్యాల : వైకల్యం అనేది ఓటుహక్కు వినియోగానికి అడ్డుకాకూడదని అంటున్నారు చిట్యాల పురపాలిక, మండలానికి చెందిన పలువురు దివ్యాంగులు. శారీరకంగా, మానసికంగా బాగుండి, చదువుకుని, సమాజం గురించి అవగాహన ఉన్నవారే చాలా మంది పోలింగ్ రోజు ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితులను చూస్తున్నాం. శారీరక వైకల్యం ఉన్నా, దివ్యాంగులు మాత్రం ప్రతి ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకుంటూ వస్తున్నారు. ఓటు హక్కు అనేది ప్రజాస్వామిక దేశంలో రాజ్యాంగం కల్పించిన హక్కు. అందుబాటులో ఉండీ..అవకాశాలు ఉండీ వినియోగించుకోలేకపోతే మనిషి జీవచ్ఛవం తో సమానమని వారు పేర్కొంటున్నారు. పార్టీలు, వ్యక్తుల పట్ల ఎవరి వ్యక్తిగత అభిప్రాయం, అభిమానం ఎలా ఉన్నా, ఓటు విషయానికి వచ్చే సరికి అన్ని వర్గాల ప్రజలను సమదృష్టితో చూడగలిగే వారిని, సమాజానికి మేలు చేయగలిగే శక్తి ఉంది అనుకున్నవారిని గుర్తించి ఓటుహక్కును వినియోగించుకుంటే రాజ్యాంగం కల్పించిన హక్కుకు సార్ధకత కలుగుతుందని వారు చెబుతున్నారు.


బతుకులు మార్చే శక్తి ఓటుకు ఉంది

నా వయసు 42 ఏళ్లు. ఐదేళ్ల వయసున్నపుడు పోలియో కారణంగా వైకల్యం ఏర్పడింది. 18 ఏళ్లు దాటిన తర్వాత ఓటు హక్కు వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు గ్రామ స్థాయి నుంచి పార్లమెంటు ఎన్నికల వరకు ప్రతి ఎన్నికలో నా ఓటు హక్కును వినియోగించుకుంటున్నాను. బతుకులను మార్చగలిగే శక్తి ఓటుకు మాత్రమే ఉందని అందరూ గుర్తించాలి.

చిర్రగోని యాదయ్య, దివ్యాంగుల హక్కుల పోరాట సమితి మండలాధ్యక్షుడు

ఇష్టంగా దరఖాస్తు చేశాను

ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన భవిత




కేంద్రంలో అవసరమైన శిక్షణ పొంది ఇంటర్మీడియట్ పూర్తిచేశాను. తర్వాత చికిత్స పరమైన కారణాలతో గతేడాది డిగ్రీలో చేరలేకపోయాను. గత ఎన్నికల సమయంలో నాన్న చనిపోవడంతో ఓటుకోసం వయసుపరంగా అర్హత ఉన్నా దరఖాస్తు చేసుకోలేకపోయాను. ఈ దఫా తొలిసారిగా ఇష్టంతో ఓటు హక్కుకోసం దరఖాస్తు చేసుకున్నాను. ఈ ఎన్నికల్లో తొలిసారి ఓటువేయబోతున్నానే భావన గొప్పగా అనిపిస్తోంది.

ఇమ్మడి లక్ష్మీప్రసన్న, చిట్యాల

మరొకరి సాయం లేనిదే నడవలేను

ఐటీఐ చదివి మరంపల్లి 11కేవీఏ ఉపకేంద్రంలో తాత్కాలిక వేతనంపై ఆపరేటర్‌గా పనిచేస్తున్న నన్ను దురదృష్టం వెంటాడింది. రెండు దశాబ్దాల క్రితం విద్యుదాఘాతానికి గురై నడుము కింది భాగమంతా చలనం లేకుండా పోయింది. మరొకరి సాయం లేనిదే అడుగు వేయలేని నేను 3 పర్యాయాలుగా ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ క్రమం తప్పకుండా ఓటేస్తున్నా. నా వయసు 48 సంవత్సరాలు. ఓటు హక్కు వచ్చిన నాటి నుంచి ప్రమాదానికి ముందు వరుసగా మూడు సార్లు అనంతర కాలంలో శరీరం సహకరించకున్నా రాజ్యాంగం ప్రసాదించిన ఓటును సద్వినియోగం చేసుకుంటున్నా. విలువలకు ప్రాధాన్యమిస్తూ, ప్రలోభాలకు లొంగకుండా స్వేచ్ఛగా నచ్చిన అభ్యర్థులకు ఓటు వేస్తున్నా.

గాయం గోవర్ధన్‌రెడ్డి, మరంపల్లి

39 ఏళ్లుగా క్రమం తప్పకుండా ...

ఓటు హక్కుకు వైకల్యం అడ్డుకాకూడదు. 2002లో జరిగిన ప్రమాదంలో నా చేయిని తొలగించారు. అంతకు ముందు లాగే చేయి తొలగించిన తర్వాత కూడా పంచాయతీ నుంచి పార్లమెంటు ఎన్నికల వరకు తేడా లేకుండా 39 ఏళ్లుగా ఓటు హక్కు వినియోగించుకుంటూ వస్తున్నాను. వైకల్యం కారణంగా పోలింగ్ బూత్ వద్దకు వెళ్లలేని వారు ఎవరి సాయం తీసుకుని అయినా వెళ్లి ఓటుహక్కును వినియోగించుకోవాలి.

వేలుపల్లి మధుకుమార్, చిట్యాల

ఓటు వినియోగంలో ఎక్కడా రాజీపడలేదు

2006 లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నా రెండు కాళ్లు తొలగించాల్సి వచ్చింది. ప్రమాదానికి ముందు, తర్వాత గానీ ఓటుహక్కును వినియోగించుకోవడంలో నేను ఎక్కడా రాజీ పడలేదు. ఎన్ని పనులు ఉన్నా పోలింగ్‌రోజు వాటిని పక్కనపెట్టి ఓటు వేయడానికి వెళ్తాను. పేద, ధనిక తేడా లేకుండా, వర్ణ, వర్గం బేధం లేకుండా రాజ్యాంగం అందరికీ సమానంగా కల్పించిన హక్కును సరిగ్గా వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం పదికాలాలు నిలబడుతుంది.సామ రవీందర్‌రెడ్డి, బొంగోని చెర్వు

# చైతన్యం చాటి.. ఆదర్శంగా నిలిచి

సూర్యాపేట : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. మునుగోడు నియోజకవర్గంలో 2022 నవంబరు 3న నిర్వహించిన ఉప ఎన్నికలో 93.13 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకుని చైతన్యాన్ని ప్రదర్శించారు. ఈ నియోజకవర్గంలోని సంస్థాన్ నారాయణపురం మండలం చిట్టెన్నబావి ఓటర్లు మరింత చైతన్యం చాటారు. ఆ ఊరిలో 241 మంది ఓటర్లున్నారు. వారిలో నలుగురు



మినహా అందరూ ఓట్లేసి ఈ ఉప ఎన్నికల్లో అత్యధికంగా 98.34 శాతం పోలింగ్ జరిగిన గ్రామంగా రికార్డుకెక్కారు. మునుగోడు మండలంలోని జక్కలివారిగూడెంలోనూ అంతే. 392 మంది ఓటర్లకు ఏడుగురు మినహా అందరూ ఓటింగ్‌లో పాల్గొని 98.21 శాతంతో రెండో స్థానంలో నిలిచారు.

# ఓటింగ్ పెంచేలా.. ప్రత్యేకత చాటేలా..



కొత్తగూడెం : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు అత్యంత కీలకమైంది. ఓటుహక్కును ఓటర్లందరూ వినియోగించుకునేలా ఎన్నికల సంఘం వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఓటు విశిష్టతను తెలిపేలా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా పోలింగ్ కేంద్రాలను సైతం ఆకర్షణీయంగా మలచాలని భావిస్తోంది. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించడంతో పాటు 100 శాతం పోలింగ్ నమోదయ్యేలా చర్యలు తీసుకుంటోంది. నవంబర్ 30న జరిగే పోలింగ్ కోసం మహిళలు, యువత, దివ్యాంగుల కోసం ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. వీటితో పాటు ఓటర్లను ఆకర్షించేలా ఆదర్శ పోలింగ్ కేంద్రాల రూపకల్పనకు సిద్ధమవుతోంది.

అతివల కోసం..మహిళలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకోవటానికి ఎన్నికల సంఘం గతంలో పింక్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అప్పట్లో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయగా ప్రస్తుతం వాటిని అయిదుకు పెంచింది. మహిళా ఓటర్లు ఎక్కువగా ఎక్కడ ఉంటారో ఆ ప్రాంతంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుంది. ఇందులో విధులు నిర్వర్తించాల్సిన సిబ్బంది, పోలీసు, పర్యవేక్షణ, భద్రత అధికారులంతా మహిళలే ఉంటారు.

ఆకర్షణగా ఆదర్శ పోలింగ్ కేంద్రాలు

ఆహ్లాదకరమైన వాతావరణంలో ఓటర్లు ఓటేసేలా ప్రతి నియోజకవర్గంలో అయిదు చొప్పున ఆదర్శ పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేయనున్నారు. పోలింగ్ కేంద్రంలోకి ఓటరు అడుగుపెట్టగానే కొత్త అనుభూతి కలిగేలా వీటిని తీర్చిదిద్దనున్నారు. గతంలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటు చేయగా ఇప్పుడు వాటిని అయిదుకు పెంచారు.

దివ్యాంగులు, యువతకు ఒక్కో కేంద్రం..

ప్రతి నియోజకవర్గంలో దివ్యాంగులు, యువతకు ఒక్కో పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేయనున్నారు. దివ్యాంగులు, యువత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దివ్యాంగ పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులే సిబ్బందిగా విధులు నిర్వర్తిస్తారని సమాచారం. యువత కోసం ఏర్పాటు చేస్తున్న వాటిల్లో యువ ఉద్యోగులే విధులు నిర్వర్తించనున్నారు. మహిళా పోలింగ్ కేంద్రాలను పెంచటం అభినందనీయం. మహిళలు పెద్దసంఖ్యలో ఓటుహక్కు వినియోగించుకోవటానికి ఇవి దోహదపడతాయి. కేంద్రాల్లో అన్ని వసతులు కల్పిస్తామనడం మంచి పరిణామం.చాడ సరిత, ఏడూళ్లబయ్యారం, పినపాక

యువ ఓటర్లను ఆకర్షించేలా ప్రత్యేక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయటం సంతోషకరం. మొదటిసారి ఓటుహక్కు వినియోగించుకోవాలని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా.వల్లాల మణికంఠ, సుభాష్‌నగర్, ఇల్లెందు

# పార్టీలు, అభ్యర్థులకు మార్గదర్శకాలు



ఖమ్మం : ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిని కచ్చితంగా పాటించాలని సూచించింది.రాజకీయ పార్టీ, అభ్యర్థి కుల, మత, భాష ద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయొద్దు.విధానాలు, పథకాలు, కార్యక్రమాలపై మాత్రమే విమర్శలుండాలి. వ్యక్తిగత జీవితంపై విమర్శలకు తావుండకూడదు.కుల, మత ప్రాతిపదికన ఓట్లు అడగకూడదు. మందిరాలు, మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థన ప్రదేశాలను ఎన్నికల ప్రచారానికి వాడుకోవద్దు.ఓటు కోసం డబ్బులు ఇవ్వడం, బెదిరించటం నిషేధం. ఒక వ్యక్తి ఓటును మరొక వ్యక్తి వేయటం చట్ట వ్యతిరేకంవ్యక్తుల అనుమతి లేనిదే వాళ్ల భూములు, భవనాలను ప్రచారానికి ఉపయోగించకూడదు.ఇతర పార్టీల ఎన్నికల ప్రచారాలకు, సమావేశాలకు ఆటంకం కలిగించవద్దు.ఎన్నికల ప్రచార సమావేశాలకు పోలీసుల నుంచి ముందుగా లిఖితపూర్వకంగా అనుమతి పొందాలి.నిషేధాజ్ఞలు, ఆంక్షలున్న ప్రదేశాల్లో సమావేశాలు నిర్వహించవద్దు.సమావేశాల్లో మైక్, లౌడ్ స్పీకర్ల వినియోగానికి ముందుగా అనుమతి తీసుకోవాలి.సమావేశానికి ఎవరైనా ఆటంకం కలిగిస్తేపోలీసులకు ఫిర్యాదు చేయాలి.ఊరేగింపులు, ప్రదర్శనల రూటు ముందుగానే పోలీసులకు తెలియజేయాలి.ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఊరేగింపు నిర్వహించాలి.ఎలాంటి దిష్టిబొమ్మలు దహనం చేయరాదు.మంత్రులు పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించకూడదు.అధికార పార్టీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని అధికారిక పర్యటనలతో కలిపి చేయరాదు.అధికార యంత్రాంగాన్ని వాడుకోవద్దు. ప్రభుత్వ వాహనాలు వాడకూడదు. అతిథి గృహాలు అందరికీ ఇవ్వాలి. వీటిపై ఎవరి పెత్తనం ఉండొద్దు.రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యం కల్పిస్తామని వాగ్దానాలు చేయొద్దు.ఉద్యోగుల బదిలీలపై పూర్తి నిషేధం ఉంటుంది.మంత్రులు ఎన్నికల అధికారులను పిలవకూడదు.ప్రైవేటు పనిపై వచ్చిన మంత్రులను ఏ అధికారి కలవకూడదు .పైలెట్ కార్లు, ఎర్ర బుగ్గ కార్లు ఉపయోగించకూడదు.ఎంపీ ల్యాడ్స్ నిధులు మంజూరు చేయొద్దు. కొత్త పనులు చేపట్టకూడదు. కొత్త పనులకు ఆమోదం తెలపకూడదు.

# 3 జిల్లాల ముచ్చట



కరీంనగర్ : కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట మూడు జిల్లాల పరిధిలో ముచ్చటగా మురిపిస్తుంది మానకొండూర్ నియోజకవర్గం. ఆరు మండలాలతో విస్తరించిన ఈ కేంద్రం కరీంనగర్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉంది. తలాపునే చెరువు.. చుట్టూ రైసుమిల్లులు..పచ్చని పొలాలు.. విత్తన ఉత్పత్తి చేసే సాగు భూములు ఉన్నాయి. ఒక వైపు వరంగల్ నుంచి విజయవాడకు వెళ్లే రహదారి.. మరో వైపు రాష్ట్ర రాజధాని మార్గం మధ్యలో విస్తరించిన నియోజకవర్గం. డైట్, ఇంజినీరింగ్ కళాశాలలు వంటి విద్యాలయాలకు నిలయంగా ఉంది.

మానకొండూర్ ప్రత్యేకత

2009 వరకు ఈ నియోజకవర్గంలోని మండలాలు కరీంనగర్, శంకరపట్నం, నెరేళ్ల, ఇందుర్తి నియోజకవర్గాల పరిధిలో ఉండేవి. నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఈ నాలుగు నియోజకవర్గాల పరిధిలోని మండలాలను కలుపుతూ మానకొండూర్ నియోజకవర్గం ఏర్పాటైంది. రిజర్వేషన్లలో భాగంగా ఎస్సీ రిజర్వ్‌డ్‌కు కేటాయించారు. మొదటిసారి గెలిచిన కాంగ్రెస్ అభ్యర్థి ఆరెపల్లి మోహన్ అప్పుడు ప్రభుత్వవిప్‌గా వ్యవహరించారు. ఆ తర్వాత వరుసగా గెలిచిన తెరాస అభ్యర్థి రసమయి బాలకిషన్ సాంస్కృతిక సమాఖ్య సారథిగా కొనసాగుతున్నారు. మళ్లీ ఇప్పుడు జరిగే ఎన్నికల బరిలో నిలుస్తున్నారు.

ఎస్సీ జనాభా అధికం..

నాలుగు నియోజకవర్గాల నుంచి విడదీసిన ఈ ఆరు మండలాలు కొత్త మూడు జిల్లా పరిధిలో విస్తరించి ఉన్నాయి. మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంతోపాటు తిమ్మాపూర్, శంకరపట్నం, గన్నేరువరం మండలాలు కరీంనగర్ జిల్లాలో ఉండగా, బెజ్జంకి మండలం సిద్దిపేట జిల్లాలో, ఇల్లంతకుంట మండలం రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో ఉన్నాయి. నియోజకవర్గ విస్తీర్ణం కూడా చాలా పెద్దగా ఉంటుంది. సబ్బండ వర్గాల సమ్మేళనంగా ఉన్నప్పటికి ఎస్సీ జనాభా శాతం ఎక్కువగా ఉండటంతో ఈ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్‌కు కేటాయించారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోనే మానకొండూర్ ఉంటుంది.

విద్యాసంస్థలకు నిలయంగా..

కరీంనగర్ జిల్లాకు కూతవేటు దూరంలో ఈ నియోజకవర్గంలో అలుగునూర్ ఉంటుంది. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ రహదారులకు కూడలిగా పేరుగాంచింది. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆమరణదీక్ష చేపట్టేందుకు వెళ్లినప్పుడు ఈ చౌరస్తా వద్ద అరెస్టు చేయడం అప్పట్లో సంచలనం రేకెత్తించింది. కరీంనగర్‌కు వచ్చే ముఖ్యమైన వారందరికీ ఈ కేంద్రం స్వాగతం పలుకుతుంది. అందుకే ఈ నియోజకవర్గంలో ఇది ప్రత్యేకంగా నిలుస్తోంది. ఇక తిమ్మాపూర్ మండల కేంద్రం విద్యాసంస్థలకు నిలయంగా ఉంటుంది. మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో విత్తన ఉత్పత్తి, పంటల సాగుకు ప్రాధాన్యం ఇస్తారు. కొన్ని గ్రానైట్ క్వారీలు కూడా ఉన్నాయి. జాతీయ, రాష్ట్ర రహదారులు బాటలు వేస్తున్నాయి.

మొత్తం జనాభా (2011) : 2,74,753 పురుషులు : 1,36,987 మహిళలు : 1,37,766 ఎస్సీ జనాభా : 22.39 శాతంమొత్తం ఓటర్లు : 2,18,413పురుషులు : 1,07,371 మహిళలు : 1,11,041ఇతరులు : 1

# పారదర్శకతకు పట్టం.. నిఘా కట్టుదిట్టం

నల్గొండ : శాసనసభ ఎన్నికలను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించడంపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. ఎలాంటి అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక నిఘా పెట్టింది. ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన వెంటనే కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు అమలు చేసేందుకు ఏడు తనిఖీ బృందాలను నియమించింది. వివిధ హెూదాలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులను వీటిల్లో సభ్యులుగా చేర్చి రంగంలోకి దింపింది. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్గొండ జిల్లాల్లోని సరిహద్దు ప్రాంతాల్లోని తనిఖీ కేంద్రాల వద్ద 24 గంటలపాటు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు.

ఫ్లైయింగ్ స్క్వాడ్(ఎఫ్ఎస్టీ)

ఈ బృందాలు ప్రచార సమయం, కోడ్ ఉల్లంఘన, నియమావళి అమలుపై వచ్చే ఫిర్యాదులపై తనిఖీ చేస్తాయి. సి-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను 100 నిమిషాల్లోపు పరిష్కరించే బాధ్యత తీసుకుంటాయి. కేంద్ర ఎన్నికల సంఘం నేషనల్ గ్రీవెన్స్ మేనేజ్‌మెంట్ సిస్టంకు రాజకీయ పార్టీల నుంచి అందిన ఫిర్యాదులను సైతం పరిష్కరిస్తాయి. ఎన్నికల నిర్వహణ విషయమై నియమావళి అమలును పర్యవేక్షిస్తాయి. రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను ప్రలోభపెట్టడానికి నగదు, బంగారం, దుస్తులు, మద్యం, విలువైన వస్తువులు, బహుమతులు ఇచ్చేందుకు ముందుకు వస్తుంటారు. అలాంటి వాటిపై దృష్టి సారిస్తారు. ఈ బృందంలో ఒక అధికారితో పాటు హెడ్ కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుల్స్, ఒక వీడియో గ్రాఫర్ ఉంటారు.



స్టాటిస్టిక్ సర్వైలెన్స్(ఎస్ఎస్టీ)

నామినేషన్ల పర్వం మొదలైన నాటి నుంచి ఈ బృందాల తనిఖీ మొదలవుతుంది. ఈ బృందంలో ముగ్గురే సభ్యులే ఉంటారు. రెండు బృందాలు రెండు షిఫ్టుల్లో 24 గంటలూ పని చేయాల్సి ఉంటుంది. సభలు, సమావేశాలకు రాజకీయపార్టీలు వెచ్చించే ఖర్చులను పరిశీలిస్తారు. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలను గురి చేస్తున్నట్లు సమాచారమందితే రహస్యంగా చిత్రీకరిస్తారు. సరిహద్దు, సమస్యాత్మక ప్రాంతాల్లో మకాం వేసి నియమావళి అమలు తీరును పర్యవేక్షిస్తుంటారు. వాహనాల తనిఖీ నిర్వహిస్తారు.

వీడియో వ్యూయింగ్ టీం(వీవీటీ)

ఈ బృందంలో ఒక డీటీ, ఇద్దరు సహాయకులు ఉంటారు. వీరు స్టాటిస్టిక్ సర్వైలెన్స్, వీడియో సర్వైలెన్స్ బృందాలతోపాటు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లోని వీడియోగ్రాఫర్స్ చిత్రీకరించిన వీడియోలను పరిశీలించి నియమావళి ఉల్లంఘనులపై ఎన్నికల అధికారులకు నివేదిస్తారు.

మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) బృందాలు

మండల స్థాయిలో ఎంపీడీవోలు, గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో కమిషనర్లు ఎన్నికల కోడ్ అమలుతీరును పర్యవేక్షిస్తున్నారు. కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వీరు ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ప్రచార చిత్రాలు,రాజకీయ నాయకులు ఏర్పాటు చేసి ఫ్లెక్సీలు, గోడమీది రాతలు, పార్టీ జెండాలను ఇప్పటికే తొలగించారు. ఎవరైనా కోడ్‌ను అతిక్రమిస్తే జిల్లా ఎన్నికల అధికారులకు నివేదిస్తారు.

లెక్కింపు బృందాలు

మొదటిసారి నియోజకవర్గానికో అకౌంటింగ్ బృందాన్ని ఎన్నికల సంఘం కేటాయించింది. ఎన్నికల్లో వ్యయ నియంత్రణకు ప్రత్యేక కసరత్తు చేసింది. కోశాగార కార్యాలయానికి చెందిన సీనియర్ అధికారుల ఆధ్వర్యంలో ఈ బృందం పని చేస్తుంది.

ఖర్చుల పరిశీలన

అసిస్టెంట్ ఎక్స్‌పెండేచర్ పరిశీలన బృందం సభ్యులు అభ్యర్థుల ఎన్నికల ప్రచారం, సమావేశాలు, ఇతర ఖర్చులను పరిశీలించి వివరాలను తెలుసుకుంటారు. ఈ బృందంలో ఒక అధికారి, ఒక సహాయకుడు, ఇద్దరు ఎంపీఎస్వోలు ఉంటారు. నియోజకవర్గానికి ఒక బృందం పనిచేస్తుంది.

వీడియో సర్వైలెన్స్ బృందాలు (వీఎస్టీ)

ఈ బృందాలు సభలు, సమావేశాల్లో రాజకీయ నాయకులు, అభ్యర్థుల ప్రసంగాలతోపాటు, ర్యాలీలు, ఇతరత్రా ప్రచార కార్యక్రమాలను వీడియోలో చిత్రీకరిస్తుంటాయి. ఈ బృందంలో ఏపీఎం, ఒక సహాయకుడు, ఒక వీడియోగ్రాఫర్ మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. ఈ బృందాలు సంబంధిత నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి రోజువారీ నివేదికలు సమర్పించాల్సి ఉంటుంది.

# కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదుకు అవకాశం

సూర్యాపేట : శాసనసభ ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘనలపై పౌరుడి చేతిలో సీ విజిల్ యాప్ ఒక బ్రహ్మాస్త్రంగా పని చేస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సీ విజిల్ యాప్‌కు సంబంధం చిన ఫ్లెక్సీని ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. అక్రమాలకు సంబంధించి పౌరులు ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తే జిల్లా ఎన్నికల అధికారితోపాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లైయింగ్ స్కాడ్‌కు చేరుతుందని, నిమిషాల వ్యవధిలోనే దర్యాప్తు చేసి ఫిర్యాదుదారుడికి తెలుపుతారన్నారు. అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్లు వాడినా, ర్యాలీలు తీసినా, నిబంధనలు ఉల్లంఘించినా, కుల మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వీరబ్రహ్మాచారి, డీఎస్పీ నాగభూషణం, పుర కమిషనర్ రామాంజులరెడ్డి, డీఈవో అశోక్, తహసీల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి పాల్గొన్నారు. అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే సామగ్రి ధరలు జిల్లా కమిటీ నిర్ణయించిన మేరకు ఉండాలని కలెక్టర్ వెంకటరావు స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన రాజకీయ ప్రతినిధుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డేతో కలిసి మాట్లాడారు. మైక్, సౌండ్ సిస్టం అనుమతి కోసం ముందస్తు దరఖాస్తు చేసుకోవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో రాజకీయ నాయకులు రాజేశ్వర్‌రావు, సత్యనారాయణ, రమేశ్, గోపి, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.కలెక్టరేట్‌లో వ్యయ పరిశీలకులు, అకౌంటింగ్ బృందాలు, ఆడిట్ బృందాల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ వెంకటరావు పలు సూచనలు ఇచ్చారు. అభ్యర్థి రూ.40 లక్షలకు మించకుండా ప్రచారం కోసం ఖర్చు చేయాలని, డిసెంబరు అయిదో తేదీ నుంచి జనవరి 4వ తేదీ వరకు అభ్యర్థులు ఖర్చుల వివరాలు తెలపాలని కోరారు.

# వేసవి శిబిరం.. భవిష్యత్తు పదిలం

కరీంనగర్ : వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న క్రీడలు ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయి. కాలక్షేపంగా నేర్చుకున్న క్రీడలను తమ భవిష్యత్తుగా మలుచుకుని క్రీడాకారులు ముందుకు సాగుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. స్పోర్ట్స్ కోటా ఉద్యోగం సాధిస్తున్నారు.

**గ్రాండ్ మాస్టర్**

కరీంనగర్‌లోని రాంచంద్రాపూర్ కాలనీకి చెందిన సి.హెచ్.ప్రసాద్, అపూర్వల కుమారుడు శ్రీశౌనక్ చంద. కరీంనగర్‌లో 2019లో జరిగిన వేసవి శిబిరంలో మొదటిసారిగా చదరంగంలో ఓనమాలు దిద్దాడు. అనంతరం కలిగిన ఆసక్తితో చెస్ అకాడమీలో కంకటి అనూప్ వద్ద శిక్షణ పొందాడు. క్రీడాకారులకు, గ్రాండ్ మాస్టర్‌కు లభించే గుర్తింపు తెలుసుకుని గ్రాండ్ మాస్టర్ లక్ష్యంగా హైదరాబాద్‌లో శిక్షణ పొందుతున్నాడు. 2021లో జరిగిన ఇంటర్నేషనల్ ఫిడే ర్యాంకింగ్ పోటీల్లో 1,365వ ర్యాంకు సాధించాడు. 2020లో అండర్ 11 ఏకగ్ర ఫిడే రేటింగ్ టోర్నమెంట్‌లో మూడో స్థానంలో నిలిచాడు. విశాఖపట్నంలో జరిగిన ఫిడే రేటింగ్‌లో మొదటి స్థానంలో నిలిచాడు. గ్రాండ్ మాస్టర్ లక్ష్యంగా చదరంగం నేర్చుకుంటున్నట్లు శ్రీశౌనక్ చంద తెలిపాడు.

**అంతర్జాతీయ స్థాయిలో రాణింపే లక్ష్యం**

కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన పయ్యావుల ఆంజనేయులు–ఉమ దంపతుల కుమార్తె లహరిక కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో 2018లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో యోగా సాధన ప్రారంభించింది. యోగా సాధనను నిత్య కృత్యం చేసుకుని కిష్టయ్య, మల్లిక వద్ద శిక్షణ పొందుతూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చాటింది. 2020 జనవరి 5న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా ఛాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించింది. 2018 కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం సాధించింది. అంతర్జాతీయ స్థాయిలో రాణించి యోగాలో శిక్షణ ఇవ్వాలన్నదే తన లక్ష్యమని చెబుతోంది లహరిక.

**స్పోర్ట్స్ కోటాలో కొలువు**

కరీంనగర్‌లోని భగత్‌నగర్‌కు చెందిన ఎస్.రఘురామ్ కిరణ్, జయశ్రీల కుమారుడు అభివర్ష్ 8వ తరగతిలో కరీంనగర్‌లోని ఈత కొలనులో 2010లో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో ఈత నేర్చుకున్నాడు. అప్పటి శిక్షకులు, ప్రస్తుత జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి కీర్తి రాజు మెలకువలు నేర్పించారు. ఈత క్రీడాకారుడి శరీర ఆకృతి, గుర్తింపు వివరించడంతో శిబిరం పూర్తయిన తర్వాత నిత్యం ఈతలో సాధన చేశాడు. 2014లో 10వ తరగతిలో అభివర్ష్ కేరళలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ ఈత పోటీల్లో పాల్గొని సత్తాచాటాడు. 2015లో కలకత్తాలో జాతీయ స్థాయి ఈత పోటీల్లో మూడు బంగారు పతకాలు, 2016 కేరళలలో జాతీయ స్థాయి ఈత పోటీల్లో మూడు బంగారు పతకాలు సాధించాడు. 2017 బెంగళూర్‌లో జూనియర్స్ నేషనల్స్, 2018లో పంజాబ్‌లో జరిగిన ఆల్ ఇండియా విశ్వవిద్యాలయం క్రీడా పోటీల్లో ఓయూ తరఫున పాల్గొని మూడు బంగారు పతకాలు సాధించాడు. 2019లో స్పోర్ట్స్ కోటాలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించి ప్రస్తుతం మంచిర్యాల ప్రత్యేక పోలీసు విభాగంలో ఉద్యోగం నిర్వహిస్తున్నాడు.

**జాతీయ కబడ్డీ జట్టులో ఉండాలని..**

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం తిరుమలాపూర్‌కు చెందిన కాసర్ల రాజయ్య, అంజవ్వల కుమారుడు శివాజి 2018లో కరీంనగర్‌లో జరిగిన వేసవి శిక్షణ శిబిరంలో కబడ్డీ శిక్షణ పొందాడు. అనంతరం మోహన్ వద్ద శిక్షణ పొందాడు. 2019, 2011లో ఉమ్మడి జిల్లాలో జరిగిన కబడ్డీ టోర్నమెంట్‌లో బెస్ట్ రైడర్‌గా గుర్తింపు పొందాడు. కబడ్డీలో భారతదేశం జట్టులో ఆడి మంచి ఆటగాడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే తన కోరిక అని శివాజి తెలిపాడు.

# ఎంత తేడా.. ఇదేం దగా!

కరీంనగర్ : వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్ల జారీలో సహకార విద్యుత్తు సరఫరా సంఘం (సెస్) నిలువు దోపిడీకి పాల్పడుతుంది. అన్నదాతల నుంచి వేలాది రూపాయలు వసూలు చేస్తూ వారిపై ఆర్థికభారం మోపుతోంది. ఉత్తర తెలంగాణ విద్యుత్తు సరఫరా సంస్థ (టీఎస్‌ఎన్‌పీడీసీఎల్) అతి తక్కువ ధరకు ఇస్తున్నా సెస్ మాత్రం భారీగా వసూలు చేస్తుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులను పలుమార్లు ప్రశ్నించినా ఫలితం లేదని కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని 13 మండలాల పరిధిలో సెస్ సేవలందిస్తుంది. 2,71,630 మంది వినియోగదారులు ప్రయోజనం పొందుతున్నారు. రోజురోజుకు సెస్ వినియోగదారుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఎన్‌పీడీసీఎల్ నుంచి కరెంటు కొనుగోలు చేసి వినియోగదారులకు అందిస్తోంది. కొత్త కనెక్షన్లు తీసుకోవాలనుకునే వారు అధికారుల అంచనా మేరకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. మిగతా విద్యుత్తు సరఫరా సంస్థల్లో వ్యవసాయ కనెక్షన్లకు రాయితీలు వర్తిస్తున్నాయి. కానీ ఇక్కడ రైతులే అవసరమైన సామగ్రి, కనెక్షన్ కోసం నిర్దేశిత రేట్ల ప్రకారం చెల్లిస్తూ వస్తున్నారు. సెస్ ఆవిర్భావం నుంచి ఎలాంటి రాయితీలు ప్రభుత్వం నుంచి తీసుకోవడం లేదు. అలాగే దరఖాస్తుదారుడి సామాజిక వర్గం, లోడ్, స్తంభాలు, కేటగిరి వారీగా కనెక్షన్లకు ఒక్కో విధంగా రేట్లు ఉంటున్నాయి. ప్రస్తుతం 74,391 వ్యవసాయ కనెక్షన్లు ఉండగా 2021–22లో 939, 2022–23లో 812 కొత్తవి జారీ చేశారు.

**టీఎస్ ఎన్‌పీడీసీఎల్ అయితే...**

టీఎస్‌ఎన్‌పీడీసీఎల్ పరిధిలో ఒక వ్యవసాయ కనెక్షన్ పొందాలంటే రూ. 5,295 వరకు చెల్లిస్తున్నట్లు అక్కడి రైతులు చెబుతున్నారు. అవసరమైన జిరాక్స్‌ల కోసం మరో రూ. 300 వరకు ఖర్చవుతుంది. దరఖాస్తు ప్రక్రియ పూర్తయిన తర్వాత అధికారులు క్షేత్ర స్థాయిలో వివరాలు పరిశీలించి అంచనాలు సిద్ధం చేస్తారు. రైతులు చెల్లించిన సొమ్ముకు మూడు స్తంభాలు వేసి తీగ లాగడం, బిగించడంతోపాటు నియంత్రికను సమకూరుస్తారు. వీటి కోసం రాష్ట్ర ప్రభుత్వం కొంత మొత్తాన్ని చెల్లిస్తుంది. ఒక వేళ నియంత్రిక బిగించాల్సి ఉంటే సుమారు రూ. 70 వేల రాయితీ అందిస్తుంది. మూడు కంటే ఎక్కువ స్తంభాలు అవసరమైతే తీగ, సామగ్రి అవసరం పడితే కొంత మొత్తాన్ని అన్నదాతలు చెల్లించాల్సి ఉంటుంది. కానీ సెస్ పరిధిలో ఇలాంటి ప్రక్రియ లేదు. రైతులకు ప్రభుత్వం నుంచి వ్యవసాయ కనెక్షన్లకు ఎలాంటి డబ్బులు రావు. దీంతో అన్నదాతలే పూర్తి ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇలా జిల్లా ప్రాంత రైతులపై ఆర్థిక భారం పడుతోంది. అధికారులు చెప్పినంత చెల్లించలేక రైతులు వ్యవసాయ కనెక్షన్లు తీసుకోవడానికి అనాసక్తి కనబరుస్తున్నారు. దీంతో పల్లెల్లో అక్రమ కనెక్షన్లు పెరిగిపోతున్నాయి. ఫలితంగా పరిమితికి మించిన లోడు కారణంగా నియంత్రికలు కొద్ది రోజులకే మరమ్మతులకు గురవుతున్నాయి. వ్యవసాయం మినహా మిగతా కనెక్షన్లకు ఎన్‌పీడీసీఎల్ మాదిరిగా కొత్తవి ఇస్తుండటం గమనార్హం. దీనిపై పలుమార్లు వినియోగదారులు ఉన్నత స్థాయి అధికారులను, సమావేశాల్లోనూ ప్రశ్నించినా ఫలితం లేదు. దీంతో అన్నదాతలపై ఆర్థికభారం పడుతుంది. ఇప్పటికైనా దీనిపై సెస్ పాలకవర్గం నిర్ణయం తీసుకుంటే కర్షకులకు మేలు జరుగుతుంది. మరోవైపు అక్రమ కనెక్షన్లు తగ్గే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పాలకవర్గ సమావేశంలో నిర్ణయం– రామకృష్ణ, ఎండీ, సెస్

# పార్కులపై పర్యవేక్షణ కరవు



వరంగల్ : నగరంలో పార్కులపై పర్యవేక్షణ కరువైంది. గ్రేటర్ ఉద్యానం, ఇంజినీరింగ్ విభాగాల సమన్వయ లోపంతో పాడైన ఆట వస్తువుల మరమ్మతులు చేయడం లేదు. బల్దియా గ్రీన్ పద్దు(బడ్జెటు), పట్టణ ప్రగతి ద్వారా లక్షలు ఖర్చు పెట్టి కాలనీల్లో పార్కులు అభివృద్ధి చేస్తున్నారు. ప్రారంభించిన తర్వాత అధికారులు పర్యవేక్షించడం లేదు. స్వయం సహాయక సంఘాలు, ఇతరులకు అప్పగించి వదిలేస్తున్నారు. పచ్చదనం, మొక్కలకు నీళ్లు పట్టడం, పిల్లల ఆట వస్తువులు, వీధి దీపాలు, తాగునీటి వసతి తదితర పనులు సక్రమంగా జరగడం లేదు. వేసవి సెలవులొచ్చాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు పార్కులకెళ్తున్నారు. అరకొర వసతులు, ఆట వస్తువులు సరిగా లేకపోవడంలో నిరాశ చెందుతున్నారు. వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లోని పార్కులను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేసింది. పార్కుల వివరాలు: కాశీబుగ్గ సిద్ధయ్య హోటల్, కాశీబుగ్గ ఏకలవ్య పార్కు, ఎల్బీనగర్, ఎస్సార్టీ కాలనీ, డాక్టర్స్ కాలనీ, టెలికం కాలనీ, ఎంహెచ్‌నగర్ చిట్టి పార్కు, క్రిస్టియన్ కాలనీ, తిమ్మాపూర్ ఫ్రీడమ్ పార్కు, వనితా వనం, కరీమాబాద్ గుండుబావి, ఉర్సు సుభాష్‌నగర్

దేశాయిపేట ఎంహెచ్‌నగర్ పార్కులో నీళ్ల ట్యాంకు మూత తెరచి ఉంచారు. ఆట వస్తువుల వద్ద ఇసుక లేదు. తాగునీళ్ల కోసం పిల్లలు ఇబ్బంది పడుతున్నారు.

వరంగల్ క్రిస్టియన్ కాలనీ పిల్లల పార్కులో ఆట వస్తువుల నిర్వహణ సరిగా లేదు. ఇసుక నింపడం లేదు.

కాశీబుగ్గ సిద్దయ్య హోటల్ పార్కులో ఆట వస్తువులు పాడైపోయాయి. తాగునీళ్ల కోసం అల్లాడుతున్నారు. వీధి దీపాలు వెలగడం లేదు.

కరీమాబాద్ గుండుబావి పార్కులో సమయ పాలన లేదు. రెండు గేట్లు మూసేసి ఉన్నాయి. పిల్లలకు తాళాలు ఇచ్చారు. తాగునీళ్లు లేవు. ఆట వస్తువులు తక్కువగా ఉన్నాయి.

42వ డివిజన్ ఉర్సు సుభాష్‌నగర్ పార్కులో పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆట వస్తువులు అందుబాటులోకి రాలేదు. పచ్చదనం కరువైంది. మొక్కలకు నీళ్లు పట్టడం లేదు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయి. వీధి దీపాలు వెలగడం లేదు. పార్కు పర్యవేక్షణ ఎవరు చేస్తున్నారో తెలియదని స్థానికులు చెబుతున్నారు.

**నిధులున్నా.. నిర్లక్ష్యమే**

కొత్త పురపాలక చట్టంతో ప్రతి మున్సిపాలిటీలో వార్షిక సొంత ఆదాయంలో పదిశాతం నిధులు గ్రీన్ పద్దుకు కేటాయిస్తున్నారు. గ్రేటర్ వరంగల్‌లో ఏటా రూ.20 కోట్లకుపైగానే కేటాయిస్తున్నారు. నిధులున్నా పార్కులు అభివృద్ధిలో అధికారులు అశ్రద్ధ కనిపిస్తుంది. నగరంలోని 66 డివిజన్లలో మొత్తం 47 పార్కులున్నాయి.

**ఆట వస్తువులు బాగు చేస్తాం**

సీహెచ్.శ్రీనివాస్‌రావు, ముఖ్య ఉద్యాన అధికారి, గ్రేటర్ వరంగల్

పిల్లల ఆట వస్తువులు బాగు చేస్తున్నాం. వేసవి సెలవుల దృష్ట్యా పార్కులు ఉదయం, సాయంత్రం తెరవాలి. తాగునీటి వసతి గురించి కమిషనర్ దృష్టికి తీసుకెళ్తాం.

# ప్రమాదాల ‘విస్తరణే’..



వరంగల్ : జాతీయ రహదారి(163)పై సర్వీస్ రోడ్లు, సైడ్ రెయిలింగ్ పనులు చేపట్టకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేదు. రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. అధిక ఖర్చుతో కూడిన పనులు చేసి.. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే పనులు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వం 2015లో రూ.1,920 కోట్లతో యాదాద్రి–వరంగల్ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. 2016లో జూన్ 1న అప్పటి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఈ పనులకు శంకుస్థాపన చేశారు. యాదాద్రి జిల్లాలోని వంగపల్లి నుంచి వరంగల్ జిల్లా అరెపల్లి వరకు 99.10 కి.మీ మార్గాన్ని 30 నెలల్లో పూర్తి చేయాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. గడువు పూర్తయి మూడేళ్లు కావస్తున్నా నేటికీ అనేక చోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

**చేయాల్సిన పనులివీ..** రహదారి విస్తరణ పనులలో భాగంగా గ్రామాలు ఉన్నచోట ప్రజల సౌకర్యార్థం సర్వీస్ రోడ్లు వేయాలి. జాతీయ రహదారిపై నేరుగా ప్రజలు రాకుండా రాకుండా మధ్యలో ఇనుప కంచెతో రెయిలింగ్ ఏర్పాటు చేయాలి. రహదారి పొడవునా హైమాస్ట్ దీపాలు, ప్రతి గ్రామంలో మినీ బస్ స్టేజీ నిర్మించాలి. గృహాల్లోకి వర్షం, డ్రైనేజీ నీళ్లు రాకుండా చర్యలు చేపట్టాలి.

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలోని రాఘవపూర్‌లో రహదారికిరువైపులా సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉండగా కంకర పోసి వదిలేశారు. గ్రామంలో 800 మీటర్ల పొడవునా గృహాలు ఉండడంతో సర్వీస్ రోడ్డు లేక ప్రజలు నేరుగా ఎక్స్‌ప్రెస్ హైవే పైకి వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. గృహాలు ఉన్నచోట విస్తరణ పనులకుగాను 75 ఫీట్ల వెడల్పు తీయగా.. రాఘవపూర్‌లో మాత్రం 100 ఫీట్లు తీశారు. ‘ఘన్‌పూర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్ వైపునకు వెళ్లే దారిలో సర్వీస్ రోడ్డు నిరుపయోగంగా మారింది. బస్టాండ్ నుంచి శ్రీవాణి గురుకులం వరకు సర్వీస్ రోడ్డు వేయాల్సి ఉండగా కేవలం విద్యుత్ కేంద్రం వరకే వేసి వదిలేశారు. చిల్పూర్ మండలం చిన్నపెండ్యాల వద్ద సర్వీసు రోడ్డు వేసినప్పటికీ బస్టాండ్‌ను ఏర్పాటు చేయలేదు. ప్రజలు ఎండలో నిల్చొని వాహనాల కోసం వేచి చూడాల్సి వస్తోంది. సర్వీసు రోడ్డు పక్కన డ్రైనేజీ పూర్తికాకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి వరద నీరుతో ప్రజలు అవస్థలు పడాల్సి వస్తుంది.

**హైమాస్ట్ దీపాలేవీ?**

ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద సర్వీస్ రోడ్డు వేసినప్పటికీ కొంతమేర హైమాస్ట్ దీపాలు ఏర్పాటు చేయలేదు. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

కొత్తురి హనుమంత్, రాఘవపూర్

**నిత్యం భయాందోళన**

రాఘవపూర్ గ్రామంలో సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేయకుండా వదిలేశారు. రహదారి దాటుతున్న క్రమంలో భయాందోళనకు గురవుతున్నాం. వెంటనే సర్వీస్ రోడ్లను నిర్మించాలి. అధికారులు స్పందించాలి

మునిగెల రమేశ్, సీపీఎం మండల కార్యదర్శి

# మినీ స్టేడియానికి మోక్షం ఎప్పుడో..!

ములుగు : జిల్లా కేంద్రంలోనే క్రీడామైదానం లేదంటే అతిశయోక్తి కాదు. విద్యార్థులు, యువకులు ఆడుకోవడానికి అవకాశమే లేకుండా పోతోంది. క్రీడా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి దూర ప్రాంతాలకు వెళ్లి మైదానాలు వెతుక్కోవాల్సిన పరిస్థితి. ములుగు పట్టణానికి చివర బండారుపల్లి రోడ్డులో ఓ ప్రైవేటు వ్యక్తి స్థలంలో క్రికెట్ ఆడుతున్నారంటే ఆశ్చర్యం కలగమానదు. కబడ్డీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, బాల్ బ్యాట్‌మెంటన్, షటిల్, ఖోఖో లాంటి తదితర క్రీడలు ఆడుకునే అవకాశమే లేదు. క్రీడా పరికరాలే తెలియవు. మినీ స్టేడియం పనులు మధ్యలో నిలిచిపోయాయి.

**జాకారం మైదానమే దిక్కు**

జాకారంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానమే జిల్లాకు పెద్ద దిక్కుగా ఉంది. ఎలాంటి క్రీడలు ఆడాలన్నా అక్కడికి వెళ్లాల్సిందే. అది చాలా దూరం కావడంతో తప్పని సరి పరిస్థితుల్లో స్కూలు గేమ్స్ నిర్వహించడం తప్ప ఇతర క్రీడాకారులు, యువకులు అక్కడకు వెళ్లలేక పోతున్నారు. ఒక వేళ ఎవరైనా అక్కడికి వెళ్లినా క్రీడా పరికరాలు అందుబాటులో ఉండవు. దీంతో పట్టణ ప్రజలు క్రీడలకు చాలా దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

**నిర్మాణంలో జాప్యం**

ములుగులో మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టారు. కాని అనుకున్నంత వేగంగా పనులు జరగడం లేదు. చేసిన పనికి బిల్లులు చెల్లించడం లేదని మినీ స్టేడియం నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారు



పనులు నిలిపివేశారు. స్థల సేకరణ చేయకుండానే 2014లో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.60 కోట్లు మంజూరు చేసింది. స్థల సేకరణకే దాదాపు 8ఏళ్లు పట్టింది. అనేక ఆటంకాలను అధిగమించి ఎట్టకేలకు బండారుపల్లి సమీపంలో సుమారు 6 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. దీంతో పనులు చాలా ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. కొద్ది రోజులు పనులు వేగంగా జరిగినా బిల్లులు రాకపోవడంతో గుత్తేదారు పనులు నిలిపి వేసి వెళ్లిపోయారు. మినీ స్టేడియం నిర్మాణం పూర్తయితే వివిధ రకాల క్రీడలు ఆడుకునేందుకు జిల్లా కేంద్రానికి చెందిన యువత, విద్యార్థులకు అవకాశం కలుగుతుంది. క్రీడా సామాగ్రి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికైనా నిధులు విడుదల చేసి స్టేడియం నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని క్రీడాకారులు కోరుతున్నారు.

# క్రమబద్ధీకరణ దరఖాస్తులు 1.13 లక్షలు

కరీంనగర్ : అనధికారిక ప్లాట్లు, అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులు పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. మూడేళ్ల కిందట ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఎదురు చూస్తున్న వారికి ఎట్టకేలకు ఊరట లభించింది. ఉమ్మడి జిల్లాలో..రెండు నగరపాలికలు, 14 మున్సిపాలిటీలు, శాతావాహన పట్టణాభివృద్ధి సంస్థ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్–2020 దరఖాస్తుల పరిశీలన మొదలైంది. అక్టోబర్ 31, 2020 వరకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరించింది. ఆ సమయంలో ఎలాంటి పత్రాలు సమర్పించకుండానే ఆన్‌లైన్‌లో రూ.వెయ్యి చెల్లించి దరఖాస్తు చేశారు. దాంతో నగర, పురపాలికల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నాలుగు జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల్లో దాదాపు 1.13 లక్షల దరఖాస్తులు రాగా అప్పటి నుంచి అలాగే పెండింగ్‌లో ఉన్నాయి.

**రసీదు, డాక్యుమెంట్లతో..**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు సమయంలో రూ.వెయ్యి చెల్లించిన రసీదుతో పాటు ఆగస్టు 26, 2020లోపు రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్ల ఆధారంగా క్రమబద్ధీకరిస్తారు. అప్పటి మార్కెట్ విలువ ఆధారంగా ఫీజు మదింపు చేస్తారు. దీనికి ఈసీ కూడా అవసరముంది. 30 ఫీట్ల రహదారి కచ్చితంగా ఉండాలి. లేదంటే మున్సిపాలిటీకి గిఫ్ట్ డీడ్ చేయాల్సి ఉంటుంది. ఫీజు మొత్తం చెల్లించిన తర్వాత ఉత్తర్వులు ఆన్‌లైన్‌లోనే తీసుకునే వీలుంది. కరీంనగర్ నగరపాలక పరిధిలో అత్యధికంగా దరఖాస్తులు ఉండటంతో వీటిని త్వరగా పరిష్కరించేందుకు, సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా హెల్ప్ డెస్క్



ఏర్పాటు చేస్తున్నారు.

**ప్రక్రియ వేగవంతానికి చర్యలు**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు రాష్ట్ర పురపాలక శాఖ ఉమ్మడి జిల్లాకు ఒక సబ్ నోడల్ అధికారిని నియమించింది. మున్సిపాలిటీల్లో ఉన్న టౌన్‌ప్లానింగ్ అధికారులకు క్షేత్రస్థాయిలో స్థలాల పరిశీలన, అనుమతులు జారీ చేసే బాధ్యతలు అప్పగించింది. సవ్యంగా ఉన్న దరఖాస్తులకే ఆమోదం పలికే అవకాశముంటుంది. ప్రక్రియ ప్రారంభం చేయడంతోనే ఆయా దరఖాస్తుదారులకు సమాచారం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. తాజా క్రమబద్ధీకరణ ద్వారా నగర, పురపాలికలకు రూ.కోట్లలో ఆదాయం రానుంది.

ఇప్పటికే భవనాలు నిర్మించుకుంటే..ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసి భవన నిర్మాణం చేసుకోవడానికి అనుమతులు తీసుకున్న వారికి క్రమబద్ధీకరణ అవసరం లేదు. భవన నిర్మాణ సమయంలోనే ఎల్‌ఆర్‌ఎస్ మొత్తాన్ని చెల్లించడంతో తిరిగి క్రమబద్ధీకరణ కోసం రానవసరం లేదని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతమున్న దరఖాస్తుల్లో ఇంటి అనుమతులు తీసుకున్నవే ఉన్నట్లు సమాచారం.

# అడుగు.. ప్రగతి వైపు

నల్గొండ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యాదాద్రి ఆలయ పునర్‌నిర్మాణ ప్రాజెక్టు ప్రక్రియలో మరో కీలక అడుగు పడింది. యాదాద్రి ఆలయ ప్రాధికార సంస్థ (వైటీడీఏ (యాడా))ను మరింత విస్తరించి ఆలయ ఆదాయాన్ని పెంచే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలో హైదరాబాద్‌లో బుధవారం ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. గతంతో పోలిస్తే ఇప్పటికే దేవస్థానం ఆదాయం గణనీయంగా పెరిగినా..భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆదాయ పరంగా క్షేత్రానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా యాడా పరిధిని విస్తరించాలని నిర్ణయించారు. క్షేత్రంలో పనుల పరిశీలనతో పాటూ ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేయాలనే తలంపుతో సీఎం కేసీఆర్ ఛైర్మన్‌గా, పదవీ విరమణ చేసిన ఐఏఎస్ అధికారి కిషన్‌రావు వైస్ ఛైర్మన్‌గా 2015 ఫిబ్రవరి 27న ప్రభుత్వం యాడాను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం యాడా పరిధిలో యాదగిరిపల్లి, సైదాపూర్, మల్లాపూర్, దాతర్‌పల్లి, గుండ్లపల్లి, రాయిగిరి, బస్వాపురం గ్రామాలున్నాయి. ఈ గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులు, నిర్మాణాలకు యాడానే అధికారికంగా అనుమతులు మంజూరు చేస్తోంది. వివిధ



రూపాల ద్వారా వచ్చే ఆదాయంతో పాటూ సమీపంలోని మరిన్ని గ్రామాలను యాడా పరిధిలో విలీనం చేస్తే ఆలయానికి ఆదాయ పరంగా ఎలాంటి ఢోకా ఉండదని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఆ మేరకు త్వరలోనే విలీనం చేసే ప్రతిపాదనలున్న గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించాలని యోచిస్తున్నారు. మరోవైపు ఈ గ్రామాల్లో ఇప్పటికే మూడు, నాలుగు సార్లు ప్రభుత్వ ప్రాజెక్టులకు భూ సేకరణ జరిగిన దృష్ట్యా విలీన ప్రక్రియకు ఆటంకాలు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

**ఎటూ తేలని ఆలయనగరి**

ఆలయనగరిలో భక్తుల బస కోసం నిర్మించే కాటేజీల అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. దాతలు ఎవరైనా రూ.కోటి ఇస్తే వారి పేరుతో విల్లా ఆకృతిలో కాటేజీల నిర్మాణం సాగుతోందని అధికారులు వెల్లడించినా.. ఉన్నతస్థాయిలో ఓ నిర్ణయం రాకపోవడంతో వాయిదా పడుతూ వస్తోంది. భక్తుల బస కోసం ప్రస్తుతం క్షేత్రంలో సరిపడినన్ని కాటేజీలు లేక పోవడంతో భక్తులు ఎక్కువ ధరకు అద్దె గదులను ఆశ్రయిస్తున్నారు. దీంతో ఇప్పటికైనా దీనిపై ఓ నిర్ణయం తీసుకొని కాటేజీల నిర్మాణం ప్రారంభిస్తే బస ఇబ్బందులు తప్పుతాయని భక్తులు కోరుతున్నారు.




తిరుమల: తెదేపా అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం అర్చకులు రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. భువనేశ్వరితో పాటు తెదేపా ఎమ్మెల్సీలు పంచుమర్తి అనురాధ, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి శ్రీవారిని దర్శించుకున్నారు. భువనేశ్వరిని కలిసేందుకు వచ్చిన స్థానికులు, తెదేపా కార్యకర్తలను పోలీసులు ఆలయానికి దూరంగా పంపించారు. శ్రీవారి దర్శనం అనంతరం భువనేశ్వరి నారావారిపల్లెకు వెళ్లారు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో చనిపోయిన తెదేపా కార్యకర్తలు, అభిమానుల కుటుంబాలను ఈ నెల 25 నుంచి భువనేశ్వరి పరామర్శించనున్నారు. 'నిజం గెలవాలి' యాత్ర ద్వారా వారానికి మూడు రోజుల పాటు ఇంటింటికి వెళ్లి పరామర్శిస్తారు. స్థానికంగా జరిగే సభలు, సమావేశాల్లోనూ పాల్గొంటారు. 25న చంద్రగిరిలో ఈ యాత్రను ఆమె ప్రారంభిస్తారు.

# ఆ మంత్రులు, సీనియర్లు లోక్ సభకు - సీఎం జగన్ మార్క్ ఎంపిక..!!



అమరావతి : ఏపీలో ఎన్నికల వేళ సీఎం జగన్ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అభ్యర్థుల ఎంపికలో ఊహించని నిర్ణయాలు తీసుకుంటున్నారు. అసెంబ్లీతో పాటుగానే లోక్ సభ అభ్యర్థుల సమీకరణాలను జగన్ పరిగణ లోకి తీసుకుంటున్నారు. ఒకే సారి అటు అసెంబ్లీ..ఇటు లోక్ సభకు అభ్యర్థులను ఖరారు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో జగన్ తన మార్క్ ఎంపిక చేస్తున్నారు. కొందరు సీనియర్లు..మంత్రులను లోక్ సభ బరిలో దించేందుకు సీఎం జగన్ నిర్ణయించారని సమాచారం.

**అభ్యర్థుల పై కసరత్తు:** ఏపీలో వై నాట్ 175 నినాదంతో సీఎం జగన్ ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో గెలుపే ప్రామాణికంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేసారు. కొందరికి సీట్లు ఇవ్వలేని పరిస్థితుల్లు మరో విధంగా అవకాశం కల్పిస్తామని ఇప్పటికే హామీ ఇచ్చారు. వారసుల విషయంలోనూ సీఎం జగన్ ఆచితూచి వ్యవహరిస్తున్నారు. కొందరు ఎంపీలను ఎమ్మెల్యేలు..ఇంకొందరు మంత్రులు – సీనియర్లను ఎంపీలుగా బరిలోకి దింపాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ ను నిడుదవోలు ఎమ్మెల్యేగా దింపే అవకాశం ఉంది. రాజమండ్రి ఎంపీగా మంత్రి చెల్లుబోయిన వేణు పేరు వినిపిస్తోంది. ఇదే సమయంలో రాజమండ్రి ఎంపీగా మాజీ మంత్రి కురసాల కన్నబాబు పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. వంగా గీత మరోసారి పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారు. ఇదే సమయంలో చలమల శెట్టి సునీల్ రంగంలోకి దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది.

**గెలుపే ప్రామాణికంగా:** ఏలూరు ఎంపీ అభ్యర్థి మార్పు ఖాయమని చెబుతున్నారు. వైసీపీ నుంచి వచ్చే ఎన్నికల్లో బోళ్ల రాజీవ్ పేరు పరిశీలనలో ఉంది. నరసాపురం నుంచి అన్నీ అనుకూలిస్తే సినీ హీరో దివంగత క్రిష్ణంరాజు సతీమణి శ్యామలను బరిలోకి దింపేలా ఇప్పటికే మిథున్ రెడ్డి సంప్రదింపులు చేసారని తెలుస్తోంది. శ్యామల ఆసక్తిగా లేకపోతే గోకరాజు రామరాజు పేరు పరిశీలిస్తున్నారు. గుంటూరు, విజయవాడ స్థానాల్లో లోక్ సభ అభ్యర్థుల విషయంలో సీఎం జగన్ భారీ కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఇక, నర్సరావు పేట నుంచి ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పేరు వినిపిస్తోంది. ఒంగోలు నుంచి కరణం బలరాంను బరిలోకి దించాలనేది సీఎం జగన్ ఆలోచన గా సమాచారం. అనంతపురం నుంచి ఎంపీగా ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి ఖాయంగా కనిపిస్తోంది. హిందూపురం నుంచి ఎమ్మెల్సీ ఇక్బాల్ నుంచి ఎంపీగా పోటీ చేయించే అంశం పైన కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. దలైలామాతో కేన్ విలియమ్సన్ అండ్ టీమ్ కొనసాగుతున్న ఉత్కంఠ:హిందూపురం ఎమ్మెల్యేగా టీఎస్ దీపిక పేరు ఖాయమైంది. కర్నూలు ఎంపీగా టీడీపీ సీనియర్ నేత కుటుంబం వైసీపీలోకి వస్తుండటంతో..వారికి కేటాయిస్తారని తెలుస్తోంది. ఇదే సమయంలో బుట్టా రేణుక పేరు పరిశీలనలో ఉంది.

నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి పేరు ఖాయమైంది. తిరుపతి, కడప, నంద్యాల, రాజంపేట, మచిలీపట్నం ఎంపీల స్థానాల్లో మార్పులు ఉండే అవకాశం లేదు. ఇక, శ్రీకాకుళం నుంచి మంత్రి ధర్మాన, స్పీకర్ తమ్మినేని పేర్లు పరిశీలనలో ఉన్నాయని తెలుస్తోంది. విజయనగరం నుంచి మంత్రి బొత్సా ను బరిలోకి దింపటం పైన చర్చ సాగుతున్నట్లు సమాచారం. అయితే, బొత్స సతీమణికి ఇవ్వటం పైనా చర్చ జరుగుతోంది. అనకాపల్లి ఎంపీగా మాజీ ఎంపీ అవంతి శ్రీనివాస్ పేరు పరిశీలనలో ఉంది. దీంతో, సీఎం జగన్ కసరత్తు..అభ్యర్థుల ఖరారు పైన వైసీపీలో ఉత్కంఠ కొనసాగుతోంది.

# సైకో జగన్ అనావృష్టికి అన్నయ్య లాంటివాడు



అమరావతి: సీఎం జగన్‌పై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సైకో జగన్ అనావృష్టికి అన్నయ్య లాంటివాడని వ్యాఖ్యానించారు. పార్టీ ముఖ్యనేతల సమావేశంలో లోకేశ్ మాట్లాడారు. "చూపు పడితే పచ్చని పంట పొలాలు ఎండిపోతాయి. అడుగుపెడితే నిండుగా ఉన్న డ్యాముల గేట్లు కొట్టుకుపోయి ఖాళీ అయిపోతాయి. ఒక్క ముక్కలో చెప్పాలంటే కరవుకి బ్రాండ్ అంబాసిడర్, దరిద్రానికి కేరాఫ్ అడ్రస్ సైకో జగన్. వందేళ్ల చరిత్రలో అతి తక్కువ వర్షపాతం నమోదై రాష్ట్రంలో కరవు విలయతాండవం చేస్తోంది. సాగునీరు మహాప్రభో అని రైతులు గగ్గోలు పెడుతుంటే.. తాడేపల్లి కొంపలో నీరో చక్రవర్తిలాగా ఇసుక–లిక్కర్ లెక్కలు వేసుకుంటూ.. రాజకీయ కక్ష సాధింపుల్లో మునిగితేలుతున్నారు జగన్. ఒక్క చాన్స్ ఇచ్చిన ఖర్మానికి వరి వేసిన రైతుకి ఉరి, పంటలు వేసిన అన్నదాతలకు మిగిలింది గుండె మంటలు. కృష్ణా పశ్చిమ డెల్టాలో ఎండిన పంట చూసి ఆందోళనతో చేలోనే ఉరి వేసుకుంటామంటోన్న రైతుల గోడు వినపడదా!, కర్నూలు జిల్లా ఉరుకుంద దగ్గర సాగునీటి కోసం అధికారుల కాళ్లపై పడిన రైతులు ఆందోళన పట్టదా!, శ్రీకాకుళం జిల్లా గార మండలంలో వర్షాభావ పరిస్థితులు, తెగుళ్లతో ఎండిన వరి పంటకి నిప్పు పెట్టిన రైతన్నల ఆగ్రహ జ్వాలలు కనపడవా! తాడేపల్లి నీరో చక్రవర్తికి..!." అంటూ లోకేశ్ మండిపడ్డారు. "మంగళగిరి అన్నా క్యాంటీన్ ఆరంభమై 500 రోజులు అయ్యింది. టీడీపీ హయాంలో ఆకలి తీర్చిన అన్నా క్యాంటీన్లను జగనాసురుడనే పెత్తందారుడు మూసేసి పేదల ఉసురు పోసుకున్నాడు. నిరుపేదల క్షుద్బాధ తీర్చేందుకు నా సొంత నిధులతో మంగళగిరి నియోజకవర్గ కేంద్రంలో అన్నా క్యాంటీన్ ఆరంభించాను. పిచ్చి జగన్ సైకో సైన్యం నానా అడ్డంకులు సృష్టించారు.

మన సంకల్పం ముందు సైకోలు ఓడిపోయారు. నేటితో మా మంగళగిరి అన్నా క్యాంటీన్ 500 రోజులు పూర్తి చేసుకుంది. లక్షలాది మంది ఆకలి తీర్చిన అన్నా క్యాంటీన్ నిర్వహణకి విరాళాలు ఇచ్చిన దాతలు, బాధ్యతలు చూస్తోన్న వలంటీర్లు, సహకరిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు, ప్రజలకు పేరుపేరునా కృతజ్ఞతలు." తెలియజేస్తున్నానని లోకేశ్ వ్యాఖ్యానించారు.




కొలంబో: పర్యాటకాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో శ్రీలంక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ సహా ఏడు దేశాల టూరిస్టులకు వీసా లేకుండానే పర్యాటక ప్రదేశాల సందర్శనకు అనుమతివ్వాలని నిర్ణయిచింది. చైనా, రష్యా, మలేసియా, జపాన్, ఇండోనేసియా, థాయ్‌లాండ్ దేశాలూ ఇందులో ఉన్నాయి. పైలట్ ప్రాజెక్ట్‌గా దీన్ని చేపట్టనుంది. ఈ మేరకు శ్రీలంక కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రి అలీ సబ్రీ వెల్లడించారు. తక్షణమే ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ఆయన తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్ట్ వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమల్లో ఉంటుందన్నారు. ద్వీప దేశమైన శ్రీలంకకు పర్యాటకమే ప్రధాన ఆదాయ వనరు. విదేశీ మారకం దీని ద్వారానే సమకూరుతోంది. కొవిడ్–19కు తోడు ఆ దేశంలో నెలకొన్న రాజకీయ, ఆర్థిక సంక్షోభం మూలంగా పర్యాటకుల రాక తగ్గింది. ఈ నేపథ్యంలో పర్యాటక రంగానికి ఊపిరి పోయాలని ఆ దేశం నిర్ణయించింది. 2023 సంవత్సరానికి గాను 20 లక్షల మందిని ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా వీసా ఫ్రీ నిర్ణయం తీసుకుంది. గత కేబినెట్ సమావేశంలోనే ఈ అంశం చర్చకు వచ్చింది. తొలుత 5 దేశాలకు వీసా ఫ్రీ ట్రావెల్‌కు అనుమతివ్వాలని భావించారు. దాన్ని తాజాగా 7కు పెంచుతూ కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు.




బీజింగ్: ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం విషయంలో చైనా అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర విమర్శలు వస్తున్న వేళ బీజింగ్ నుంచి కీలక వ్యాఖ్యలు వెలువడ్డాయి. ప్రతి దేశానికీ ఆత్మరక్షణ హక్కు ఉంటుందని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ సోమవారం వ్యాఖ్యానించారు. అయితే, అంతర్జాతీయ మావనతా చట్టాలకు అనుగుణంగా, సామాన్య పౌరులకు రక్షణ కల్పించే విధంగా చర్యలు ఉండాలని సూచించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారి ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. త్వరలో వాంగ్ అమెరికా పర్యటనకు వెళ్లనున్నారు. ఈ తరుణంలో ఇలాంటి వ్యాఖ్యలు రావడం గమనార్హం. హమాస్‌పై చర్యలు తీసుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందంటూ చైనా పరోక్షంగానైనా అంగీకరించడం ఇదే తొలిసారి.

గతవారం అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఇజ్రాయెల్– హమాస్ మధ్య కాల్పుల విరమణకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఈజిప్ట్ సహా ఇతర అరబ్ దేశాలతో కలిసి పాలస్తీనా సమస్యకు వీలైనంత త్వరగా పరిష్కారం కోసం సమన్వయం చేస్తామని వ్యాఖ్యానించారు. కానీ, ఈ సమయంలో ఎక్కడా హమాస్ దాడిపై ఖండన, ఇజ్రాయెల్‌కు మద్దతును ప్రస్తావించలేదు. ఈ విషయంలో ఇప్పటి వరకు అస్పష్ట వైఖరిని అనుసరించిన డ్రాగన్ తాజాగా స్వరం మార్చడం గమనార్హం. ఇజ్రాయెల్–హమాస్ ఉద్రిక్తతలు రోజురోజుకీ మరింత తీవ్రమవుతుండటంపై వాంగ్ యీ తాజాగా విచారం వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున సామాన్య పౌరుల మరణాలకు దారితీస్తుండడం తమకు ఆందోళన కలిగిస్తోందన్నారు. సామాన్యులకు హాని కలిగించే అన్ని చర్యలను వెంటనే ఆపేయాలని కోరారు. ఈ విషయంలో చైనాకు ఎలాంటి స్వార్థ ఆలోచనలు లేవని వివరణ ఇచ్చారు.

ఇరు పక్షాల మధ్య ఘర్షణలు వీలైనంత త్వరగా సమసిపోవాలని ఆకాంక్షించారు. తద్వారా అన్ని దేశాల ఆందోళనలకు ఒక మార్గం లభిస్తుందని తెలిపారు. వాంగ్ యీ అక్టోబర్ 26 నుంచి 28 మధ్య అమెరికాలో పర్యటించనున్నారు. అగ్రరాజ్య విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్, జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవన్‌తో సమావేశం కానున్నారు. ఈ తరుణంలో చైనా నుంచి ఇలాంటి సానుకూల వ్యాఖ్యలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# గాజాపై ఇజ్రాయెల్ చర్యలు.. ఆ దేశానికే బెడిసికొట్టొచ్చు: ఒబామా



వాషింగ్టన్: హమాస్ ఉగ్ర నెట్‌వర్క్ లక్ష్యంగా గాజాలో సాగిస్తోన్న పోరులో భాగంగా ఇజ్రాయెల్ తీసుకుంటున్న కొన్ని చర్యలు.. చివరకు ఆ దేశానికే బెడిసి కొట్టే అవకాశం ఉందని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా హెచ్చరించారు. గాజాను దిగ్బంధించి ఆహారం, నీటి సరఫరా నిలిపివేత వంటి ఆంక్షలు.. ఇజ్రాయెల్ విషయంలో పాలస్తీనీయుల ఆగ్రహాన్ని మరింత పెంచవచ్చున్నారు. పైగా ఇజ్రాయెల్‌కు అంతర్జాతీయ మద్దతునూ బలహీనపరుస్తాయని చెప్పారు. ఒకవైపు హమాస్ దాడులను ఖండిస్తూనే.. మరోవైపు యుద్ధంలో ప్రాణనష్టాన్ని పట్టించుకోని ఇజ్రాయెల్ సైనిక వ్యూహాలు.. చివరకు వారికే ఎదురుతగిలే ప్రమాదం ఉందని ఒబామా హెచ్చరించారు. "గాజాకు ఆహారం, నీరు, విద్యుత్తును నిలిపివేయాలని ఇజ్రాయెల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం.. మానవతా సంక్షోభాన్ని దిగజార్చడమే కాకుండా, పాలస్తీనీయుల ఆగ్రహాన్ని మరింత ఎగదోస్తుంది. ఇజ్రాయెల్‌కు ప్రపంచ మద్దతును దెబ్బతీసే అవకాశం ఉంది. ఆ దేశ శత్రువులకు ప్రయోజనం చేకూర్చడంతోపాటు స్థానికంగా శాంతి, స్థిరత్వాలను సాధించేందుకు చేస్తున్న దీర్ఘకాలిక ప్రయత్నాలను బలహీనపరుస్తుంది" అని ఒబామా వ్యాఖ్యానించారు. అయితే, హమాస్ దాడులను ఖండిస్తూ.. తనను తాను రక్షించుకునే విషయంలో ఇజ్రాయెల్‌కు తన మద్దతును పునరుద్ఘాటించారు. అదే సమయంలో దాడుల్లో పౌర ప్రాణనష్టంపై హెచ్చరించారు.

ఒబామా అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో.. హమాస్– ఇజ్రాయెల్ విభేదాలు మొదలయ్యాయి. ఆ సమయంలో ఇజ్రాయెల్ ఆత్మరక్షణ హక్కుకు ఆయన మద్దతు ఇచ్చారు. అయితే, వైమానిక దాడుల కారణంగా పాలస్తీనీయుల ప్రాణనష్టం పెరగడంతో.. సంయమనం పాటించాలని ఇజ్రాయెల్‌కు సూచించారు. ఇరు వర్గాల మధ్య శాంతి ఒప్పందాన్ని కుదిర్చేందుకు మధ్యవర్తిత్వానికి ప్రయత్నించినప్పటికీ.. ఒబామా యంత్రాంగం విఫలమైంది.

ఒబామా తన పాలనలో ఇరాన్‌తో అణు ఒప్పందంపై చర్చలు జరపడం.. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపింది. అప్పుడు అమెరికా ఉపాధ్యక్షుడిగా ఉన్న బైడెన్ ఇద్దరి మధ్య మధ్యవర్తిగా వ్యవహరించారు.

# ఏపీ ఆర్థిక స్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలి: పురంధేశ్వరి



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితి అంచన కోసం ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని భారతీయ జనతా పార్టీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌తో మంగళవారం పురంధేశ్వరి భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలను వివరిస్తూ కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్లు, ముఖ్యంగా బేవరేజ్ కార్పొరేషన్ వంటి సంస్థల పైన కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు జరిపించాలని కోరారు. ఈ మేరకు నిర్మలా సీతారామన్‌కు ఇచ్చిన వినతి పత్రంలోని ప్రధాన అంశాలపై పురంధేశ్వరి ప్రకటన విడుదల చేశారు. "ఈ ఏడాది జులై 26న ఆర్థిక అవకతవకలు, అప్పటి వరకు చేసిన మొత్తం అప్పులు రూ. 10.77 లక్షల కోట్లు. రాష్ట్ర ఆర్థిక నిర్వహణ తీరు ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. రాష్ట్రానికి చెందిన పార్లమెంట్ సభ్యులు మొత్తం రాష్ట్ర అప్పులపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా.. కేవలం ఆర్‌బీఐకు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రూ. 4.42 లక్షల కోట్ల అప్పులను మాత్రమే చెప్పింది. కార్పొరేషన్లు సహా ఇతర అవసరాలకు చేసిన అప్పులను ప్రస్తావించలేదు. ప్రభుత్వం చేస్తున్న అప్పులు, భవిష్యత్తులో కట్టలేక వచ్చే తిప్పల నుంచి బయట పడేయాలని రాష్ట్ర భాజపా చేస్తోన్న ప్రయత్నాలను ఈ ప్రభుత్వం తప్పుగా చిత్రీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఆర్థిక అవకతవకలు, కార్పొరేషన్ల ద్వారా తీసుకున్న రుణాలు, ఆస్తుల తనఖా పెట్టి తెచ్చిన అప్పులు, ఇతర గ్యారంటీలను పరిగణనలోకి తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలి. గత నాలుగు సంవత్సరాలుగా చేసిన పనులకుగాను గుత్తేదారులకు చెల్లింపులు చేయలేని దయనీయ స్థితిలోకి రాష్ట్రాన్ని నెట్టారు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేయాల్సిన చెల్లింపులు సకాలంలో చేయకపోవడం వల్ల పెద్ద ఎత్తున బ్యాంకుల్లో బకాయిలు పేరుకుపోతున్నాయి. రాష్ట్ర ప్రజలు అడిగేది ఒక్కటే. గత నాలుగేళ్లుగా రాష్ట్రంలో బడ్జెట్, అకౌంటింగ్ విధానం అస్తవ్యస్తంగా ఉంది. ప్రస్తుతం రాష్ట్రం మీద ఉన్న మొత్తం అప్పు రూ. 11 లక్షల కోట్లు. ఈ రుణం రాబోయే 30 సంవత్సరాల్లో తీర్చాలన్నా ఏడాదికి కనీసం రూ. 36 వేల కోట్లు అవసరమవుతుంది. ఇప్పుడు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో రాష్ట్ర ప్రభుత్వ నిర్వహణ మరింత కష్టంగా మారుతుంది. మరోపక్క మద్యం ద్వారా సంవత్సరానికి వచ్చే రూ. 30 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం లెక్కలోకి రాకుండా మళ్లిస్తోంది. రాష్ట్ర ఆర్థిక అవకతవకలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి" అని కేంద్ర మంత్రికి ఇచ్చిన వినతిపత్రంలో పురంధేశ్వరి పేర్కొన్నారు.

# జగన్ పెట్టే ప్రతి స్కీమ్.. ఒక స్కామే: ఎంపీ కనకమేడల



మోపిదేవి: సీఎం జగన్ పెట్టే ప్రతి స్కీమ్.. ఒక స్కామేనని తెదేపా రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ అన్నారు. అవనిగడ్డలో కొలువైన లంకమ్మ అమ్మవారు, మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం మాజీమంత్రి మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలోనే ప్రముఖ అవినీతి రాజకీయవేత్త, అత్యంత ధనిక సీఎం జగన్ అని జాతీయ మీడియా చెబుతున్న దశలో.. చంద్రబాబుపై బురద చల్లేందుకే అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయించారన్నారు. జగన్ పాలనలో రాష్ట్ర అదాయంలో 60శాతం ఎటు పోతుందో లెక్కే లేదన్నారు. చివరకు చిన్నపిల్లలకు పెట్టే పప్పుల చిక్కీలో కూడా అవినీతి బయటపడింద న్నారు. చంద్రబాబు హయాంలో, జగన్ పాలనలో చేసిన అప్పులు, అభివృద్ధి, ఆదాయం, సంక్షేమ పథకాలు, సంపద వృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయమంటే ఇప్పటి వరకు చేయలేదన్నారు. లెక్కలు చెప్పమంటే రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అబద్ధాలు చెబుతూ బుకాయిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో పోలీసు పాలనపోయి.. ప్రభుత్వ పాలన రావాలంటే చంద్రబాబు అధికారంలోకి రావాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు కృషి చేయాలని పార్టీ శ్రేణులను కోరారు.

# హంస నందిని బికినీ ట్రీట్.. బ్లాస్టింగ్

ఇండస్ట్రీలోకి అడుగుపెట్టే ప్రతి అమ్మాయి హీరోయిన్ కావాలనే కలలు కంటుంది. కానీ, అందరికీ ఆ కలలు నిజం కావు. నటి హంసా నందిని సైతం మంచి హీరోయిన్ అవ్వాలనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. కానీ పాపం హీరోయిన్ గా క్లిక్ కాలేకపోయింది. దీంతో, ఐటెం సాంగ్స్, ఇతర పాత్రలకే పరిమితమైంది. ముఖ్యంగా అత్తారింటికి దారేది, మిర్చి, లౌక్యం వంటి సినిమాల్లో ఐటెం సాంగ్స్ లో మెరిసింది. ఆ పాటలు బాగా క్లిక్ అయ్యాయి. దీంతో, ఆమెకు ఎక్కువ గుర్తింపు వచ్చింది. అయితే, ఆపాటల తర్వాత ఆమెకు ఎక్కువగా మళ్లీ అలారూటి అవకాశాలే రావడం గమనార్హం. గ్లామర్ రోల్స్ చేయడం మొదలుపెట్టింది. చిన్న చిన్న అవకాశాలు అయితే వచ్చాయి కానీ, తనను తాను నటిగా నిరూపించుకునే అవకాశం రాలేదనే చెప్పాలి. అయితే, ఈ బ్యూటీ తన ఫోకస్ మొత్తం సోషల్



మీడియాపై పెట్టింది. ఎప్పటికప్పుడు తన ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా బికినీలో మెరిసింది. బ్లాక్ కలర్ బికినీలో తన థైస్ కనిపించేలా హాట్ ఫోజులు ఇచ్చింది. స్విమ్మింగ్ పూల్ వద్ద మంచి ఫోజు ఇచ్చి నిలపడింది. అంతే, ఇప్పుడు ఫోటోకి లైకుల వర్షం కురుస్తోంది. హంస అందాలకు నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. బ్యూటిఫుల్ మ్యామ్ అంటూ కొందరు, ఈ సండే ఇంత హాట్ గా ఉంటుందా అని కొందరు కామెంట్స్ చేస్తుండటం విశేషం. ఇదిలా ఉండగా, కొంతకాలం క్రితం హంస నందిని క్యాన్సర్ బారిన పడ్డారు. 2022 ఏడాది ఆరంభంలో తను ఈ మహమ్మారి కోరల్లో చిక్కకున్నట్టు ప్రకటించిన ఆమె.. చాలా బాధను అనుభవించింది. అప్పటి నుంచీ ట్రీట్మెంట్ తీసుకుంటూ.. అప్పడప్పుడు అప్ డేట్ ను అందిస్తూ వచ్చింది. చివరకు క్యాన్సర్ ను జయించింది. క్యాన్సర్ ని జయించిన తర్వాత ఆమె మరింత ఉత్సాహంగా సోషల్ మీడియాలో తన ఫోటోలను షేర్ చేస్తుండటం విశేషం. ప్రస్తుతానికి అయితే, ఆమె చేతిలో ఎలాంటి సినిమాలు లేవు.

# ఎన్టీఆర్ తర్వాత చరణ్‌తో ఖాయమేనా?

తనదైన అందం ప్రతిభతో ఆకట్టుకుంటున్న జాన్వీ కపూర్ సోషల్ మీడియాల్లో అసాధారణ ఫాలోవర్లతో భారతదేశంలో పాపులర్ సెలబ్రిటీగా గుర్తింపు తెచ్చుకుంది. అయినా కానీ తనకు తగినంత ప్రచారం లభించడం లేదని జాన్వీ భయపడుతోందని తెలిసింది. మంచి PRని నిర్వహించడంలో తాను ఎల్లపుడూ పూర్ అని సదరు యువనాయిక అంగీకరించింది. నెట్‌ఫ్లిక్స్‌లో జాన్వీ కపూర్ నటించిన 'బవాల్' సానుకూల సమీక్షలను అందుకుంది. అయితే సెల్ఫ్ ప్రమోషన్ విషయంలో తాను వెనుకబడిపోతున్నానని జాన్వీ అభిప్రాయపడింది. తాను స్వయం ప్రచారం చేసుకోకపోవడంతో తనను లేదా తన ప్రదర్శనలను ఎవరూ గమనించరని భయపడుతున్నట్లు కూడా జాన్వీ పేర్కొంది. సినీ పరిశ్రమ ప్రజా సంబంధాలు సహా దూకుడైన ప్రమోషన్‌ను నమ్ముతుంది. అయినా కానీ "చేసిన పని తనకు తానుగా మాట్లాడాలి" అనే సామెతను తాను ఎప్పుడూ నమ్ముతానని



యువనాయిక పేర్కొంది. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న ఈ బ్యూటీ టాలీవుడ్ లో దూసుకెళుతుందని భావిస్తే అది ఏమంత సులువుకాదని అర్థమవుతోంది. తదుపరి రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు సనా దర్శకత్వంలో జాన్వీ నటిస్తుందని ప్రచారమైంది. ఈ సినిమా కోసం చర్చలు జరుపుతోందన్న టాక్ ఉంది. కానీ దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఎన్టీఆర్ దేవరతో జాన్వీ కపూర్ తెలుగు తెరకు పరిచయమవుతోంది. వెనువెంటనే రామ్ చరణ్ సినిమాని ఆమె దక్కించుకుంటే టాలీవుడ్ లో వెనుదిరిగి చూసే పరిస్థితి ఉండదు. జాన్వీ చివరిసారిగా వరుణ్ ధావన్‌తో కలిసి OTT విడుదలైన 'బవాల్'లో కనిపించింది. ప్రస్తుతానికి తెలుగు చిత్రసీమ సహా దక్షిణాదిన తనని తాను ప్రమోట్ చేసుకునేందుకు జాన్వీ ప్రయత్నిస్తోంది. తనకు పీఆర్ కమ్యూనికేషన్ సరిగా లేనందున రేసులో వెనకబడ్డానని ఫీలవుతోంది. ఆ గ్యాప్ ని ఎలా ఫిల్ చేస్తుందో చూడాలి.




# సంక్రాంతికి మరో బిగ్ హీరో




సంక్రాంతి సీజన్ అంటే తెలుగు రాష్ట్రాలలో అతి పెద్ద పండుగ అనే సంగతి తెలిసిందే. అందుకే స్టార్ హీరోలు అందరూ ఈ సీజన్ ని టార్గెట్ చేసుకొని తమ సినిమాలు రిలీజ్ చేస్తూ ఉంటారు. టాలీవుడ్ నుంచి సంక్రాంతి టార్గెట్ గా ఏకంగా అరడజను సినిమాల వరకు సిద్ధం అవుతున్నాయి. అందులో సూపర్ స్టార్ మహేష్ బాబు గుంటూరు కారం, వెంకటేష్ సైంధవ్, విజయ్ దేవరకొండ ఫ్యామిలీ స్టార్ సినిమాలు ఉన్నాయి. అలాగే రవితేజ ఈగల్, ప్రశాంత్ వర్మ హనుమాన్ మూవీస్ కూడా డేట్స్ కన్ఫర్మ్ చేసుకొని ఉన్నాయి. కేవలం తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా తమిళనాడులో కూడా పొంగల్ సీజన్ చాలా స్పెషల్. ఈ ఏడాది పొంగల్ ట్రీట్ గా అజిత్ తునివు. విజయ్ వారిసు సినిమాలు రిలీజ్ అయ్యి సక్సెస్ అందుకున్నాయి. వచ్చే ఏడాది పొంగల్ సీజన్ కి కోలీవుడ్ లో సినిమాలు సిద్ధం అవుతున్నాయి. ఇప్పటికే శివ కార్తికేయన్ కొత్త మూవీ రిలీజ్ డేట్ ఎనౌన్స్ అయ్యింది. ఇప్పుడు పా రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ హీరోగా తెరకెక్కుతోన్న తంగలాన్ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. ఈ విషయాన్ని చిత్ర యూనిట్ అఫీషియల్ గా కన్ఫర్మ్ చేయకపోయిన ఇప్పటికే డేట్ ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో చియాన్ విక్రం డిఫరెంట్ గెటప్ లో కనిపిస్తున్నాడు. తంగలాన్ అనే ట్రైబల్ తెగకి చెందిన వ్యక్తిగా ఈ చిత్రంలో విక్రమ్ కనిపిస్తున్నాడు. సినిమాలో మెజారిటీగా అతను మాసిన గడ్డం, గోచీతోనే కనిపించనున్నాడు.

యాక్షన్ బ్యాక్ డ్రాప్ లో పీరియాడికల్ జోనర్ లో ఈ మూవీ తెరకెక్కుతోంది. పాన్ ఇండియా సినిమాగా పా రంజిత్ ఈ చిత్రాన్ని సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరిస్తున్నారు. మాళవిక మోహనన్ ఈ సినిమాలో హీరోయిన్ గా నటిస్తోంది. ఆమె లుక్, ఆహార్యం కూడా చాలా డిఫరెంట్ గా ఉండబోతోంది. ఇది వరకు ఎన్నడూ చూడని సరికొత్త కథతో తంగలాన్ ని పా రంజిత్ ఆడియన్స్ ని చూపించబోతున్నారు. మరి ఈ మూవీ ఎలాంటి ఆదరణ సొంతం చేసుకుంటుంది అనేది వేచి చూడాలి.

# చీరలో జాన్వీ సొగసు చూడతరమా?





చారెడేసి కళ్లతో కపూర్ గాళ్ జాన్వీ మాయ చేస్తోంది. అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా ఎన్నో అంచనాల నడుమ వెండితెరకు పరిచయమైన జాన్వీ కపూర్ పై ఆరంభం కొన్ని విమర్శలు వచ్చాయి. తన అందం నటన గురించి విమర్శించినవాళ్లున్నారు. అయితే కొద్ది కాలానికే తమ అభిప్రాయాల్ని మార్చుకుని జాన్వీ ముగ్ధ మనోహర రూపానికి తన నటనకు మంత్రముగ్ధులం అయిపోతున్నామని పొగిడేసిన వాళ్లు ఉన్నారు. ఇక ఇటీవలి కాలంలో కమర్షియల్ సినిమాల క్వీన్ గా ఎదిగేందుకు జాన్వీ చేయని ప్రయత్నం లేదు. హిందీలో వరుస చిత్రాల్లో నటించి తనని తాను నిరూపించుకున్న జాన్వీ కపూర్ త్వరలోనే టాలీవుడ్ లో ఆరంగేట్రం చేస్తోంది. ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాతో జాన్వీకి పాన్ ఇండియా స్టార్ డమ్ ఖాయమైంది. కొరటాల శివ బిగ్ కాన్వాస్ పై దేవరను చిత్రీకరిస్తుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇకపోతే జాన్వీ కపూర్ నిరంతర ఫోటోషూట్లు అభిమానులకు స్పెషల్ ట్రీట్ గా నిలుస్తున్నాయనడంలో సందేహం లేదు. తాజాగా చీరలో కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిచ్చింది ఈ బ్యూటీ. చాలా కాలం తర్వాత శ్రీదేవి జూనియర్ ని చూసినట్టుగా ఉందంటూ ఈ ఫోటోలు వీడియోకు అభిమానులు వ్యాఖ్యల్ని జోడిస్తున్నారు. చారెడేసి కళ్లు అందమైన చిరునవ్వుతో జాన్వీ అలా చీరందంలో హొయలు పోతున్న తీరు ఈ వీడియోలో మైమరిపింపజేస్తోంది. ప్రస్తుతం ఇది అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.

**జాన్వీ సుదీర్ఘ నోట్ సారాంశం:** జాన్వీ కపూర్ నటించిన బవాల్ ఇటీవలే ఓటీటీలో విడుదలై విమర్శకుల నుంచి మిశ్రమ స్పందనలు అందుకున్న సంగతి తెలిసిందే. నితేష్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటించాడు. ఈ చిత్రంపై కొందరు మిశ్రమ స్పందనలు వ్యక్తం చేయగా మరికొందరు ఇద్దరు నటీనటుల నటనను ప్రశంసించారు. తాజా ఫలితంతో అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ జాన్వీ సుదీర్ఘమైన నోట్‌ను రాసింది. అయితే తాజా రిపోర్ట్ ని అనుసరించి ఈ సీజన్ లో ఓటీటీలో వీక్షించిన అత్యంత పాపులర్ చిత్రంగా బవాల్ నిలిచింది. అభిమానుల నుండి తన నటనకు లభించిన ప్రేమకు జాన్వీ ఇన్‌స్టా వేదికగా ధన్యవాదాలు తెలిపింది. బవాల్ లో వరుణ్ హిస్టరీ టీచర్ అజయ్ పాత్రను పోషించగా, మూర్ఛ రోగి అయిన అతని భార్య నిషా పాత్రలో జాన్వీ నటించింది. ఐరోపాలో హనీమూన్ కి వెళ్లినప్పుడు ఈ జంట ఎలాంటి సమస్యలను ఎదుర్కొంది? అన్నది ఓటీటీ తెరపైనే చూడాలి.

# క్లీ వేజ్ తో కైపెక్కిస్తున్న క్యూట్ బ్యూటీ

ఉత్తరాది ప్రేక్షకులను పలు హిందీ సినిమాలు ఇంకా సిరీస్ లతో మెప్పించిన ముద్దుగుమ్మ సందీప ధార్. ఈ అమ్మడు 2010 సంవత్సరం లో ఇసి లైఫ్ మే సినిమా తో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. అప్పటి నుండి ఇప్పటి వరకు కూడా సినిమాలు, సిరీస్ లతో ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. ఈ అమ్మడికి అదృష్టం కలిసి రాకపోవడంతో భారీ ఆఫర్లు దక్కలేదు.. కానీ అందాల ఆరబోత ఫోటోలు మరియు వీడియోలతో ఎప్పుడు కూడా వార్తల్లో నిలుస్తూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు క్లీ వేజ్ షో తో మతి పోగొడుతూ.. కైపెక్కిస్తూ ఈ క్యూట్ బ్యూటీ వావ్ అంటూ ప్రతి ఒక్కరు నోరు వెళ్లబెట్టేంత అందాల విందు చేసింది. ఈ రేంజ్ అందాల ఆరబోత చేసినా కూడా



స్టార్ హీరోలు ఈమె వైపు ఎందుకు చూడటం లేదు.. ఒక వేళ స్టార్ హీరోల సినిమా ల్లో ఆఫర్లు వచ్చినా కూడా చిన్న పాత్రలకే ఎందుకు పరిమితం అవుతుంది అంటూ నెటిజన్స్ కొందరు ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి ఈ అమ్మడు క్లీ వేజ్ నడుము అందాలతో ఎప్పటికప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తూనే ఉంది. మొదటి సినిమా తో ఫిల్మ్ ఫేర్ అవార్డును అందుకోవడం తో పాటు పలు అవార్డులను సొంతం చేసుకుంది. దబాంగ్ 2 సినిమా లో గెస్ట్ రోల్ లో కనిపించిన ఈ అమ్మడు హీరో పంతి సినిమాలో మంచి పాత్రలో నటించి గుర్తింపు దక్కించుకుంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం అయినా ఈ అమ్మడు అందాల విందు విషయంలో తగ్గేదే లే అన్నట్లు ఇలాంటి హాట్ ఫోటో లు షేర్ చేస్తూనే ఉంది.

# కవ్విస్తున్న ఇస్మార్ట్ బ్యూటీ అందాలు

2015 సంవత్సరంలో వజ్రకాయ అనే కన్నడ సినిమాతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నాభ నటేష్. ఈ అమ్మడు కన్నడంలో మూడు సినిమాలు చేసినా కూడా పెద్దగా గుర్తింపు రాకపోవడంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. 2018లో సుదీర్ బాబు హీరోగా నటించిన నన్ను దోచుకుందువటే అనే సినిమాలో హీరోయిన్గా నటించి ఆకట్టుకుంటుంది. తెలుగులో మొదటి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. సినీ ప్రముఖుల నుండి ఇంకా విమర్శకుల నుండి ప్రశంసలు దక్కించుకుంది. దాంతో వెంట వెంటనే అవకాశాలు లభించాయి. ముఖ్యంగా రామ్ కి జోడిగా నటించిన ఇస్మార్ట్ శంకర్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు అందులోని ఈ ముద్దుగుమ్మ పాత్రకి మంచి మార్కులు దక్కాయి.



ప్రస్తుతం సినిమాలేమీ చేయకుండా కూడా సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ అందాల ఆరబోత ఫోటో షూట్స్ చేస్తూ అలరిస్తుంది. తాజాగా ఈ ఫోటోలతో నెటిజన్స్ ని కవ్విస్తోంది.

ఈ రేంజ్ లో అందాలు ఆరబోత చేస్తే స్టార్ హీరోలు సైతం వావ్ అనాల్సిందే. కానీ అదృష్టం కలిసి రాకపోవడం వల్ల ఏమో కానీ ఈ ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. ఇలాంటి ఫోటో షూట్స్ తో అయినా ఈ ముద్దుగుమ్మకి అవకాశాలు వస్తాయేమో చూడాలి. ఇంత హాట్ అందాల ఆరబోత చేస్తున్న నభ నటేష్ నడుము అందాలు చూపిస్తూ చేసిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముందు ముందు అయినా ఈమెకి ఆఫర్స్ వస్తాయేమో చూడాలి.




## కాంగ్రెస్ రెండో జాబితా ఎంపిక కత్తి మీద సామేనా..!

ఢిల్లీ: రేపు మధ్యాహ్నం 12 గంటలకు కాంగ్రెస్ సీఈసీ సమావేశం కానుంది. ఈ సమావేశంలో రెండో విడత అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేయనుంది. తొలి విడతలో 55 మంది అభ్యర్థులను కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. రెండో జాబితాలో ఎంత మంది పేర్లను ప్రకటిస్తుందో వేచి చూడాలి. ఇక నాలుగు సీట్లను వామపక్షాలకు కాంగ్రెస్ కేటాయించింది. మరో 60 సీట్లలో అభ్యర్థులను కాంగ్రెస్ సీఈసీ ఖరారు చేయనుంది.

**కొత్తోళ్లకే ప్రాధాన్యత :** ఇదిలా ఉంటే తొలి జాబితాలో ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన నేతలకు ప్రాధాన్యం లభించింది.

మొత్తం 12 సీట్లు వారికి దక్కాయి. మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్‌రావు, నిర్మల్ నియోజకవర్గానికి చెందిన కూచాడి శ్రీహరిరావు, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇటీవలి కాలంలో కాంగ్రెస్‌లో చేరారు. వెలమ సామాజిక వర్గానికి చెందిన ఈ నలుగురికీ సీట్లు దక్కాయి. ఇటీవల కాంగ్రెస్ కండువా కప్పుకొన్న వినయ్ కుమార్ రెడ్డి, సునీల్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కూసుకుళ్ల రాజేషరెడ్డి, సరిత, ఎ చంద్రశేఖర్, వేముల వీరేశం, కోట నీలిమలకు కూడా అభ్యర్థిత్వం లభించింది.

**వెయిటింగ్‌లో సీనియర్లు! :** ఇక తొలి జాబితాలో సీనియర్లకు మొండిచెయి ఎదురైంది. తొలి జాబితాలో సీటు దక్కని వారిలో సీనియర్ నేతలు మధుయాష్కీ, షబ్బీర్ అలీ, మహేషకుమార్‌గౌడ్, పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉన్నారు. వీరిలో కొందరు తమకు సీటు దక్కుతుందా లేదా అన్న ఆందోళనలోనూ ఉన్నారు. తొలి జాబితాలో వివాదరహిత అభ్యర్థులే అధికంగా ఉన్నారు. తుది జాబితా కూర్పు మాత్రం స్క్రీనింగ్ కమిటీకి సవాలే అంటున్నారు. ఇటు బీసీలు, అటు వివిధ సామాజిక వర్గాల వారు సీట్లలో తమ వాటా తేల్చాలని ఒత్తిడి తెస్తున్నారు.

ఈ నేపథ్యంలో నిర్ణయం తీసుకోవడం కత్తి మీద సాము అయ్యేలా ఉందని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి.



## రాష్ట్రంలో గజగజ మొదలైంది..! తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు..!!

హైదరాబాద్ : రాష్ట్రంలో గజగజ మొదలైంది. చలి వణికిస్తోంది. నాలుగైదు రోజుల క్రితం వరకు పగలు, రాత్రి సమయాల్లో ప్రజలు ఉక్కపోతతో అల్లాడిపోయారు.

నైరుతి రుతుపవనాలు తిరుగుముఖం పట్టడంతో తెలంగాణ వైపు శీతల గాలులు వీస్తున్నాయి. దీంతో చాలా జిల్లాల్లో రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా దిగువకు చేరుకున్నాయి. ఈ క్రమంలో తెల్లవారుజామున పొగమంచు కమ్మేస్తోంది. హనుమకొండలో సాధారణం కన్నా 2.7 డిగ్రీలు తగ్గి, కనిష్ఠ ఉష్ణోగ్రత 19.5 డిగ్రీలు నమోదైంది. ఆదిలాబాద్‌లో 1.8 డిగ్రీలు తగ్గి 17.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రామగుండం, మెదక్, హనుమకొండలో పగటి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఖమ్మంలో మాత్రం సాధారణం కన్నా 3.3 డిగ్రీలు అధికంగా, గరిష్ఠ ఉష్ణోగ్రత 35.2 డిగ్రీలు నమోదైంది. హైదరాబాద్, భద్రాచలం, ఆదిలాబాద్‌లోనూ సాధారణం కన్నా కొంచెం ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

## ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ నుంచి ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం



హైదరాబాద్ : తెలంగాణ స్థితిగతులు మార్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై డెవలప్మెంట్ ఎకనామిక్స్ అనే ఇతివృత్తంలో భాగంగా కీలకోపన్యాసం చేయాల్సిందిగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ప్రతిష్టాత్మక ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ఆహ్వానం పలికింది. తెలంగాణ పథకాల ఖ్యాతి ఖండాంతరాలు దాటింది. తెలంగాణలో అమలవుతున్న కార్యక్రమాలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణను గుర్తించిన లండన్‌లోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆక్స్‌ఫర్డ్ యనివర్సిటీ కీలకోపన్యాసం ఇవ్వడానికి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించింది. గత పదేళ్ల పాలనలో సీఎం కేసీఆర్ చేపట్టిన అనేక కార్యక్రమాలు ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని ఆకర్షించాయి. ఇటీవల బ్రిడ్జ్ ఇండియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడానికి లండన్‌లో పర్యటించిన సమయంలో యూనివర్సిటీ విద్యార్థులతో కల్వకుంట్ల కవితతో భేటీ అయిన విషయం తెలిసిందే. దాంతో తెలంగాణ అభివృద్ధి మోడల్‌పై ఈ నెల 30వ తేదీన ప్రసంగించాల్సిందిగా కోరుతూ యూనివర్సిటీ ఆహ్వానం పంపింది. ముఖ్యంగా తెలంగాణ వ్యవసాయ రంగం పురోగమించిన తీరు, రైతులకు రైతుబంధు పేరిట సీఎం కేసీఆర్ అందిస్తున్న పెట్టుబడి సాయం, 24 గంటల ఉచిత విద్యుత్తు అంశాలపై కవిత ప్రసంగిస్తారు. అలాగే, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రీఛార్జ్ అయ్యేలా కుల వృత్తులను ప్రోత్సహించడమే కాకుండా అనేక రూపాల్లో గ్రామీణ ప్రాంతాల ఆర్థిక పరిపుష్టికి సీఎం కేసీఆర్ చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించనున్నారు. మిషన్ భగీరథ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి నల్లా కనెక్షన్ ద్వారా తాగునీళ్లను సరఫరా చేసిన మొట్టమొదటి రాష్ట్రంగా తెలంగాణ చరిత్ర సృష్టించింది. వైద్య, విద్యా రంగంలో రాష్ట్ర ప్రభుత్వం సాధించిన ప్రగతిపై కూడా యూనివర్సిటీలో కల్వకుంట్ల కవిత ప్రసంగించనున్నారు.

సీఎం కేసీఆర్ దూరదృష్టి, బహుళార్థ ప్రయోజనాల పథకాల రూపకల్పన పై అంతర్జాతీయ వేదికపై కవిత వివరించనున్నారు. ఒక్కొక్క పథకం అమలు వెనక ఎంత ప్రయోజనం ఉందో చెప్పడమే కాకుండా సీఎం కేసీఆర్ ఆలోచనల ప్రతిరూపమే తెలంగాణ అభివృద్ధి అని అంతర్జాతీయ వేదికపై కవిత చాటి చెప్పనున్నారు.

## 50వేల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా..: ఉత్తమ్‌కుమార్ రెడ్డి




తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి 50వేల మెజార్టీతో గెలుస్తానని ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 50వేల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గినా రాజకీయాల నుంచి వైదొలుగుతానని చెప్పారు. ఉత్తమ్ సమక్షంలో పలువురు భారాస నేతలు మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారు. సమన్వయంతో పని చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారెంటీలు అమలు చేస్తామన్నారు.

## తెలంగాణ పాల పిట్ట కేసీఆర్ : మంత్రి హరీశ్ రావు


సంగారెడ్డి : తెలంగాణ పాల పిట్ట సీఎం కేసీఆర్. తెలంగాణలో కేసీఆర్ ఒకవైపు.. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకి ఎక్కుపెట్టిన వ్యక్తులు మరో వైపు ఉన్నారు. తేల్చుకోవాల్సింది ప్రజలేనని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. సంగారెడ్డిలోని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం నివాసంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విధానాలపై మంత్రి ఫైర్ అయ్యారు. ఓటుకు నోటు – నోటుకు సీటు అనే వాళ్లు, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయని వ్యక్తి తెలంగాణను ఎలా అభివృధి చేస్తారని ప్రశ్నించారు. పార్టీ ఆదేశానికి కట్టుబడి సంగారెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చింతా ప్రభాకర్‌కు అండగా ఉంటామని స్పష్టం చేశారు. ఈ సారి సంగారెడ్డిలో గులాబీ జెండా ఎగురవేస్తామన్నారు. పార్టీ పట్నం మాణిక్యం, ఆయన అనుచరులను కాపాడుకుంటున్నది. కర్ణాటక రైతులు కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేశామని అక్కడి ప్రభుత్వాన్ని తిడుతున్నారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు లేవు అని ప్రశ్నించారు. దేశంలో కరెంటు కోతలు ఉంటే మనం నాణ్యమైన కరెంటు ఇస్తున్నామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ధరణి వద్దు అంటున్నది. ధరణి వద్దు అంటే పటేల్ పట్వారీ వ్యవస్థ తెస్తారా? ధరణిలో లోపాలు ఉంటే సరి చేస్తామని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ కంప్యూటర్ మా నాన్న తెచ్చాడు అన్నారు. ఇప్పుడు మేం చేసేంది కంప్యూటరీకరణ. రాష్ట్రం కేసీఆర్ చేతిలో ఉంటేనే సుభిక్షంగా ఉంటుందని మంత్రి తెలిపారు.




## భారాస దూకుడు.. మేనిఫెస్టోపై మరింత ప్రచారం

తాజాగా సర్వేలు చేయిస్తున్న భారాస.. మేనిఫెస్టో ఆశించిన రీతిలో ప్రజల్లోకి వెళ్లలేదని భావిస్తోంది. ఇన్‌ఛార్జీలను వార్‌రూమ్‌లను ఏర్పాటు చేసి.. నియోజకవర్గాల్లో అభ్యర్థులు, నేతల ప్రచారాన్ని పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళికలు చేసింది. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ రెండో విడత పర్యటనలు గురువారం ప్రారంభం కానున్నాయి. మిగిలిన పది స్థానాలకూ ఒకటి, రెండు రోజుల్లో బీ–ఫామ్‌లు ఇవ్వనున్నారు.

## మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలించిన కేంద్ర బృందం



భూపాలపల్లి: కాళేశ్వరం ఎత్తిపోతల్లోని మేడిగడ్డ (లక్ష్మీ) బ్యారేజ్ కుంగిన నేపథ్యంలో అక్కడ కేంద్ర బృందం పరిశీలించింది. వంతెన కుంగిన ఘటనపై ఆరుగురు నిపుణులతో కేంద్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఛైర్మన్ అనిల్ జైన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ.. మంగళవారం బ్యారేజ్‌ను పరిశీలించింది. 20వ పిల్లర్ వద్ద పగుళ్లకు గల కారణాలతో పాటు బ్యారేజ్ పటిష్ఠత, జరిగిన నష్టంపై కమిటీ అంచనా వేయనుంది. సమగ్ర పరిశీలన తర్వాత కేంద్ర జలశక్తి శాఖకు నివేదించనుంది. కేంద్ర బృందం వెంట కాళేశ్వరం ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు, ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు ఉన్నారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిన నేపథ్యంలో నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నీటి మట్టం కనిష్ఠ స్థాయికి చేరింది.

బ్యారేజ్ ఎగువ నుంచి 57 గేట్ల ద్వారా 22,500 క్యూసెక్కుల వరదను దిగువకు విడిచిపెట్టారు. ఈ నెల 21న రాత్రి భారీ శబ్దంతో బ్యారేజ్ 20వ పియర్ కుంగిపోయింది. దీంతో బి–బ్లాకులోని 18, 19, 20, 21 పిల్లర్ల మధ్య ఉన్న వంతెన ఒక అడుగు మేర కుంగిపోయింది. డ్యాంకు.. క్రస్టు గేటుకు మధ్య పగుళ్లు వచ్చాయి.

గోదావరిపై ఉన్న ఈ బ్యారేజీకి ఒకవైపు మహారాష్ట్ర, రెండోవైపు తెలంగాణ రాష్ట్రాలు ఉన్నాయి.




## వంతెన రూపంలో దూసుకొచ్చిన మృత్యువు.. పరుగెత్తినా దక్కని ప్రాణం!

గాంధీనగర్: నిర్మాణంలో ఉన్న వంతెన కూలడంతో ఘోర ప్రమాదం జరిగింది. వంతెన కూలడాన్ని గమనించి ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఆ కాంక్రీట్ స్లాబుల కింద అతడు నలిగిపోయిన సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. గుజరాత్‌లోని పాలన్‌పుర్‌లో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పాలన్‌పుర్‌లో నిర్మాణంలో ఉన్న వంతెనకు ఇటీవలే ఆరు కాంక్రీట్ స్లాబులు అమర్చారు. అయితే సోమవారం అవి కూలిపోయాయని అధికారులు తెలిపారు. ఆ ఘటనలో ఓ వ్యక్తి మరణించిన తీరు కలచివేస్తోంది. వంతెన కూలిపోతున్న విషయాన్ని గమనించిన అతడు.. తన ఆటోను వదిలి, ప్రాణాలు కాపాడుకునేందుకు పరిగెత్తాడు. కానీ అప్పటికే ఆలస్యమైపోయింది. అతడు ఎంత వేగంగా పరిగెత్తినా.. వంతెన స్లాబులు కూలిపోవడంతో వాటి కింద అతడు నలిగిపోయి, ప్రాణాలు కోల్పోయాడు. మరో ఇద్దరు వ్యక్తులు కూడా వాటికింద చిక్కుకుపోయినట్లు ఘటనా స్థలంలోని వ్యక్తులు చెప్పారు. ఆటోతో పాటు ట్రాక్టర్ కూడా వాటికింద నుజ్జునుజ్జు కావడంతో వారు కూడా చిక్కుకున్నట్లు భావిస్తున్నారు. ఇది పాలన్‌పుర్–అంబాజీని అనుసంధానించే రైల్వే ఓవర్‌బ్రిడ్జ్ అని, శిథిలాల కింద ఎంతమంది ఉన్నారనేది అప్పుడే చెప్పలేమని అధికారులు తెలిపారు.

## డీసీసీబీ వైస్ చైర్మన్ మాణిక్యం నివాసానికి హరీష్‌రావు..



సంగారెడ్డి : సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం ఇంటికి మంత్రి హరీష్ రావు వెళ్లారు. సంగారెడ్డి బీఆర్ఎస్ టికెట్ ఆశించి మాణిక్యం భంగపడ్డారు. టికెట్ దక్కకున్నా సరే పోటీలో ఉంటానని ఇప్పటికే మాణిక్యం ప్రకటించారు. మాణిక్యంను గత కొన్ని రోజులుగా బీఆర్ఎస్ అధిష్టానం బుజ్జగిస్తున్నారు. నచ్చజెపేందుకు మంత్రి హరీష్ రావు ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ద్రోహులకు.. తెలంగాణ కోసం గడ్డి పోచల్లా పదవి త్యాగాలు చేసిన వారి మధ్య ఈ సారి ఎన్నికల్లో పోటీ జరగనుందన్నారు. కేసీఆర్ చేతిలో తెలంగాణ రాష్ట్రం ఉంటేనే సుభిక్షంగా ఉంటుందన్నారు.

కాంగ్రెస్ అంటేనే మాటలు, మూటలు, ముఠాలు, మంటలని విమర్శించారు. నాడు ఓటుకు నోటు – నేడు నోటుకు సీటు కాంగ్రెస్ తీరు అని తెలిపారు. తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయని కిషన్ రెడ్డి రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తారని హరీష్ రావు అన్నారు. ధరణి వద్దు అని అంటే పటేల్ వ్యవస్థ మళ్ళీ తెచ్చినట్టేనన్నారు. సంగారెడ్డిలో ఈ సారి కచ్చితంగా బీఆర్ఎస్ జెండా ఎగారేస్తామన్నారు. చింతా ప్రభాకర్ గెలుపునకు కృషి చేస్తానని మాణిక్యం హామీ ఇచ్చారని హరీష్ రావు తెలిపారు.

## 'ముందుంది మొసళ్ల పండుగ అంటే ఇదేనేమో': కేటీఆర్



సకాలంలో విద్యుత్ సరఫరా చేయడం లేదని ఆరోపిస్తూ కర్ణాటకలోని కొల్హార తాలూకా రోణిహాల్ గ్రామానికి చెందిన రైతులు, స్థానికులు వినూత్న నిరసన తెలిపారు. స్థానికంగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్‌కు ట్రాక్టర్‌లో ఓ మొసలిని తీసుకొచ్చారు.

'కరెంట్ ఇస్తారా.. సబ్‌స్టేషన్‌లో మొసలిని వదలాలా?' అంటూ సిబ్బందిని ప్రశ్నించారు. శుక్రవారం జరిగిన ఈ ఘటకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తాజాగా ఈ వీడియోను తెలంగాణ మంత్రి కేటీఆర్ రీట్వీట్ చేశారు. 'ముందుంది మొసళ్ల పండుగ అంటే ఇదేనేమో' అంటూ రాసుకొచ్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత త్రీఫేజ్ విద్యుత్ ఇవ్వడం వల్ల పొలాలకు వెళ్లడం ఇబ్బందిగా మారిందని కర్ణాటకలోని రైతులు ఆరోపిస్తున్నారు. పొలానికి వెళ్తున్నప్పుడు స్థానిక కాలువల నుంచి మొసలి పిల్లలు, చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వన్యప్రాణులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి పొలానికి వెళ్లిన సమయంలో దొరికిన మొసలిని ట్రాక్టర్‌లో సబ్‌స్టేషన్‌కు తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయం వద్దకు వచ్చిన అటవీశాఖ సిబ్బంది ఆ మొసలిని బంధించి సంరక్షణకేంద్రానికి తరలించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com